
సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
సోమవారం, 06.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 164
పేజీలు: 12 వెల: రూ. 5

## రెండు కౌన్సిళ్లకే రేవంత్‌పై
# వ్యతిరేకతా?!
### రెండు మున్సిపాలిటీల ఫలితాలపైనే చర్చ




- వరుస పరాజయాల మధ్య బీఆర్ఎస్‌కు ఊపిరి పోసిన రెండు విజయాలు
- బీఆర్ఎస్ విజయాన్ని పెద్ద రాజకీయ సంకేతంగా మలుస్తున్న కేటీఆర్ వ్యాఖ్యలు
- రేవంత్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందా? లేక రాజకీయ అతి విశ్లేషణా?
- స్థానిక ఎన్నికల ఫలితాలకు రాష్ట్ర రాజకీయ అర్థాలు కల్పించడం ఎంతవ రకు సరైంది?
- చిన్న ఫలితాలపై పెద్ద రాజకీయ యుద్ధం.. అధికార,-ప్రతిపక్షాల మధ్య మాటల దాడి
- మున్సిపల్ తీర్పు, రాష్ట్ర ప్రజాభిప్రాయం.. అసలు నిజం ఏమిటి?
- ముందున్న ఎన్నికలకే అసలు పరీక్ష.. ఇప్పుడిదంతా రాజకీయ వ్యూహమే

**ముద్ర, డెస్క్ :**
తెలంగాణ రాజకీయాల్లో తాజా మునిసిపల్ ఫలితాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లి మునిసిపాలిటీల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం రాజకీయంగా చిన్న సంఘటనలా కనిపించినా, దాని చుట్టూ నెలకొన్న రాజకీయ వ్యాఖ్యానాలు మాత్రం పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు, కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడిన తీరు ఈ ఫలితాలకు రాజకీయ ప్రాధాన్యతను మరింత పెంచాయి. కేటీఆర్ ఈ విజయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాందిగా అభివర్ణించడం గమనార్హం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని ఆయన పేర్కొనడం రాజకీయంగా ఒక దూకుడు. రెండు మునిసిపల్ చైర్మన్ స్థానాల్లో గెలవడం వలన ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరిగిందని తేల్చేయడం ఎంతవరకు సమంజసం?
వాస్తవానికి, మునిసిపల్ ఎన్నికలు సాధారణంగా స్థానిక అంశాలపై ఆధారపడి ఉంటాయి. స్థానిక నాయకుల ప్రభావం, అభివృద్ధి పనులు, వ్యక్తి గత సంబంధాలు వంటి అంశాలు ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. రాష్ట్ర స్థాయి రాజకీయ ధోరణిని ప్రతిబింబించే ఎన్నికలు ఇవి కావు. అయినప్పటికీ, ప్రతి చిన్న విజయాన్ని పెద్ద రాజకీయ సందేశంగా మలచడం రాజకీయ పార్టీల సహజ స్వభావం. బీఆర్ఎస్ కూడా అదే పద్ధతిని అనుసరిస్తోందని చెప్పవచ్చు. మిగతా 02లో

## కేరళ ఓటరు
# తీర్పు ఎటు?
### ఎల్‌డీఎఫ్ vs యూడీఎఫ్ లలో గెలుపెవరిది?

- విజయన్ హ్యాట్రిక్‌పై సస్పెన్స్
- ప్రభుత్వ వ్యతిరేకత ఎంతవరకు ప్రభావం?
- స్థానిక సమస్యలే కీలకంగా మారిన ఎన్నికలు
- ఉచితాల కంటే సుపరిపాలనకు ఓటర్ల మొగ్గు
- స్వల్ప ఆధిక్యమే ఫలితాన్ని నిర్ణయించే అవకాశం




**ముద్ర, డెస్క్ :**
కేరళలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లోనే కాకుండా సాధారణ ప్రజల్లోనూ తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతమైన రాష్ట్రంగా పేరుగాంచిన కేరళలో ఈసారి పోరు మరింత రసవత్తరంగా మారింది. సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ (లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్), కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూడీఎఫ్ (యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్) మధ్య పోటీ ఈసారి నిజంగా నువ్వా నేనా అన్నట్టుగా మారింది. పలు సర్వేలు కూడా ఫలితాలు అతి స్వల్ప ఆధిక్యంతోనే నిర్ణయించబడతాయని సూచిస్తున్నాయి. సాంప్రదాయంగా కేరళ ఓటర్లు ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్‌లకు మారుమారుగా అధికారం అప్పగిస్తూ వచ్చారు. ప్రభుత్వ వ్యతిరేకత సహజంగానే ప్రతిపక్షానికి అనుకూలంగా పనిచేస్తుందనే భావన కూడా ఇక్కడ బలంగా ఉండేది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సంప్రదాయాన్ని చెరిపేసి ఎల్‌డీఎఫ్‌ను వరుసగా రెండోసారి అధికారంలోకి తీసుకువచ్చారు. మిగతా 02లో

## సైనికుడి కోసం అమెరికా
# బిగ్ ఆపరేషన్
### ఇరాన్‌లో కూలిన అమెరికా యుద్ధ విమానం..
### పైలట్ రక్షణతో హైడ్రామా



- ఎఫ్-15 ప్రమాదం తర్వాత మిస్సింగ్ అధికారి కోసం ఉత్కంఠ గాలింపు
- ఇరాన్ పర్వతాల్లో మ్యాన్‌హంట్.. అమెరికా స్పెషల్ ఫోర్సెస్ భారీ ఆపరేషన్
- సీఐఏ మాయచర్యలు.. పైలట్ రక్షణలో వ్యూహాత్మక ట్విస్ట్
- విమానాల పేల్చివేత, హెలికాప్టర్ల వివాదం.. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తత పెరుగుదల

10

## దేశంలోనే అతిపెద్దది
# తెలంగాణ హైకోర్టు
### సీఎం రేవంత్ రెడ్డి

- కొత్త భవన సముదాయం నిర్మిస్తున్నాం
- ఇండియాలోని హైకోర్టు భవనాలకు బెంచ్ మార్క్ గా నిర్మాణం
- నగరాలు, పట్టణాల్లో 49 కోర్టులు, నివాస భవనాల నిర్మాణ ప్రాజెక్టుల నిర్మాణం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
హైకోర్టు కాంప్లెక్స్ అన్ని వర్గాల ప్రజలకు దేవాలయం లాంటిదని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అలాంటి హైకోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసే అవకాశం రావడం తనకు సంతోషంతో పాటు గర్వంగా ఉందన్నారు. రాజకీయ నాయకుల జీవితాల్లో ఇలాంటి అవకాశం అరుదుగా వస్తుందన్న ఆయన ఆ అవకాశం తనకు దక్కిందన్నారు. న్యాయవ్యవస్థకు అత్యుత్తమ సౌకర్యాలు అందించడం కార్యనిర్వాహక విభాగం బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ఇక్కడ మిగతా 02లో



## దురంధర్.. కేరళ స్టోరీ..
# అన్నీ నిజాలే
### సినిమాలపై విమర్శలకు కేరళ గడ్డపై ప్రధాని కౌంటర్

- వాస్తవాలను చూపించే చిత్రాలపై దుష్ప్రచారం జరుగుతోందని విమర్శ
- 'లవ్ జిహాద్' వంటి అంశాలపై ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందని స్పష్టం
- దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిన ప్రధాని వ్యాఖ్యలు

09

# బాసర.. నయనానందకరం
### 9 అంతస్తుల రాజగోపురం.. ఈశాన్యం వైపున కోనేరు
రూ.225 కోట్లతో బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునఃనిర్మాణం
నేడు సీఎం రేవంత్ భూమి పూజ

10




## సింగరేణిలో అవినీతిపై
# విచారణకు సిద్ధమా?
### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్

- 'సేవ్ సింగరేణి' రౌండ్ టేబుల్ సమావేశంలో ఐదు తీర్మానాలు
- సింగరేణి సంస్థ పరిరక్షణకు మరో ఉద్యమం
- రాజస్థాన్ తో తెలంగాణ సోలార్ ఒప్పందం, లిథియం రిఫైనరీ
- అల్ట్ మిన్ కంపెనీతో అగ్రిమెంట్ లో భారీ అవినీతి

09



## బాబు జగ్జీవన్‌కు
# నివాళి
దేశ ప్రజాస్వామ్య పునాదులను బలోపేతంలో ఆయన పాత్ర కీలకం
డిప్యూటీ సీఎం భట్టి

03

## ఒక్క ఫొటో వంద
# మాటల పెట్టు
మాజీ ఉప రాష్ట్రపతి
ఎం.వెంకయ్యనాయుడు




02

# ఫుడ్ టెన్షన్..

- క్యాల్షియం కార్బైడ్ వాడకం ఆరోగ్యానికి ముప్పు అంటున్న నిపుణులు
- బయట మెరుపు.. లోపల విషం? మామిడి పండ్లపై సందేహాలు
- పిల్లలు, వృద్ధులపై ఎక్కువ ప్రభావం
- మార్కెట్లలో తనిఖీలు పెంచాలని డిమాండ్

**ముద్ర, డెస్క్ :**
వేసవి కాలం వచ్చిందంటే.. అందరికీ ముందుగా గుర్తొచ్చేది మామిడి పండ్లు. కానీ ఈ ఏడాది హైదరాబాద్ మార్కెట్లలో మామిడి పండ్ల కొనుగోలుపై జనం ఆందోళన చెందుతున్నారు. పండ్లను త్వరగా పండించేందుకు వ్యాపారులు వాడుతున్న ప్రమాదకర రసాయనాల వల్ల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా క్యాల్షియం కార్బైడ్ వాడకంపై నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరి ఈ వేసవిలో మనం తినే మామిడి పండ్లు ఎంతవరకు సేఫ్..? ఆ వివరాలు చూద్దాం.. మిగతా 02లో

### రసాయనాలతో పండుతున్న మామిడి.. వినియోగ దారుల్లో భయం



సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఫుట్‌బాల్ ఆడి ఆకట్టుకున్నారు. 74వ పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకలు హైదరాబాద్‌లో పోలీసులతో కలిసి గోల్స్ కొట్టారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 06.04.2026
www.mudranews.in | @mudranews



## అమెరికా నేవీ సీల్స్ స్థాపన




అమెరికా నెవీ సీల్స్ 1962లో స్థాపించబడింది. అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నెడీ వీటిని.

# దేశంలోనే అతిపెద్దది తెలంగాణ హైకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మించబోయే భవనం దేశంలోనే అతిపెద్ద హైకోర్టు సముదాయాల్లో ఒకటిగా మాత్రమే కాకుండా, ఆధునికత, మౌలిక వసతుల పరంగా ఒక ప్రమాణంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నూతన భవన సముదాయాల నిర్మాణాలను 2027, డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని ప్రకటించారు. హైకోర్టు కొత్త భవన సముదాయ నిర్మాణంతో పాటు రాష్ట్రంలోని వివిధ నగరాలు, పట్టణాల్లో 49 కోర్టులు, నివాస భవనాల నిర్మాణ ప్రాజెక్టులను కూడా చేపడుతున్నట్టు చెప్పారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్–2 నూతన భవన నిర్మాణ పనులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. భారతదేశంలోని అగ్రశ్రేణి న్యాయ మేధావులతో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా ఉందని సీఎం చెప్పారు. ఇలాంటి సందర్భం చాలా అరుదుగా వస్తుందన్నారు. ఈ భవన సముదాయం కేవలం నిర్మాణం కాదని, తమ ప్రభుత్వ ప్రజాస్వామ్య విలువలకు ప్రతిబింబం అని సీఎం అభివర్ణించారు. అన్ని వ్యవస్థలు పరస్పర గౌరవం, సహకారంతో పనిచేయాలని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. న్యాయ వ్యవస్థకు తమ ప్రభుత్వం అత్యున్నత గౌరవాన్ని ఇస్తుందన్నారు. 2023 డిసెంబర్‌లో తమ ప్రభుత్వం ఏర్పడినప్పుడు తీసుకున్న మొదటి నిర్ణయాల్లో హైకోర్టుకు కొత్త భవన సముదాయాన్ని నిర్మించాలన్న నిర్ణయం ఒకటన్నారు. అందుకోసం రాజేంద్రనగర్‌లో వంద ఎకరాలకు పైగా భూమిని కేటాయించినట్లు వివరించారు. భవనాల కోసం జోన్––1లో ఇప్పటికే ప్రారంభించిన పనులు వేగంగా జరుగుతున్నాయన్న ఆయన నేడు జోన్––2లో నివాస భవనాలకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. వీటి నిర్మాణాలను డిసెంబర్, 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు పరస్పర ఆధారపడి, గౌరవంతో పనిచేస్తాయని సీఎం అన్నారు. కొత్తగా నిర్మించే హైకోర్టు సమాజానికి, ప్రజాస్వామ్యానికి ఒక ప్రతీకగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇది పేదలు, బలహీనులు న్యాయం కోసం వచ్చే వారికి వేదికగా నిలుస్తుందన్నారు. రాబోయే వందేళ్లపాటు పేదలు, బలహీనులు, అణగారిన వర్గాలు న్యాయం కోసం ఈ మందిరానికి వస్తారన్నారు. దేశంలో ఒక దేవాలయం, మసీదు, చర్చి, గురుద్వారా నిర్మించడం గొప్ప విషయం. కానీ ఒక కోర్టు సముదాయం నిర్మించడమంటే, అందుకోసం ప్రత్యేకంగా ప్రాంగణం సృష్టించడమంటే, దీన్ని ప్రజలందరి కోసం నిర్మించే ఒక పవిత్ర ఆలయంగా భావిస్తానని ముఖ్యమంత్రి చెప్పారు.





**న్యాయవ్యవస్థ బలోపేతం: జస్టిస్ సూర్యకాంత్**

తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న జనాభా, న్యాయపరమైన అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అన్నారు. న్యాయవ్యవస్థకు అవసరమైన భవనాలు, సాంకేతికతను అందించడం ద్వారా సామాన్యులకు త్వరితగతిన న్యాయం అందుతుందన్నారు. కొత్త హైకోర్టు ప్రాంగణం కోసం అత్యంత విలువైన భూమిని కేటాయించినందుకు, నిర్మాణ పనులకు పూర్తి సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి ఎస్ నరసింహ, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎస్ వెంకటనారాయణ భట్టి, జస్టిస్ అలోక్ ఆరాధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ తో పాటు ఇతర న్యాయకోవిదులు పాల్గొన్నారు.



# ఫుడ్ టెన్షన్..

(మొదటిపేజీ తరువాయి)

క్యాల్షియం కార్బైడ్‌తో అసలైన ముప్పు

మామిడి పండ్లు సహజంగా పండాలంటే సమయం పడుతుంది. కానీ మార్కెట్లోకి అందరికంటే ముందుగా పండ్లను తెచ్చి లాభాలు గడించాలని కొంత మంది వ్యాపారులు క్యాల్షియం కార్బైడ్ అనే రసాయనాన్ని వాడుతున్నారు. ఇక ఇది పండ్లను బయటకు చాలా అందంగా, పచ్చగా కనిపించేలా చేస్తుంది. కానీ లోపల మాత్రం విషపూరితంగా మారుతాయి. ఈ రసాయనం వల్ల పండ్లలోని సహజమైన రుచి, పోషకాలు నశించిపోతాయి. ఇక పండ్లు కొనేటప్పుడు అవి మరీ పసుపు పచ్చగా మెరిసిపోతుంటే కాస్త జాగ్రత్తగా ఉండటం మంచిది.

**ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం**

ఈ రసాయనాలతో పండిన పండ్లను తింటే వెంటనే వాంతులు, కడుపునొప్పి, తల తిరగడం వంటి సమస్యలు రావచ్చు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు వీటిని తింటే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉంది. ఇక దీర్ఘకాలంలో ఇలాంటి కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల కిడ్నీలు, కాలేయంపై ప్రభావం పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పండ్లను ఆరోగ్యకరమైన ఆహారంగా భావించి తినే సామాన్యులకు, ఇలాంటి రసాయనాలు ప్రాణాంతకంగా మారుతున్నాయి.

**అధికారులు మేల్కోవాలి**

హైదరాబాద్‌లోని వివిధ మార్కెట్లలో ఇప్పటికే ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. అయితే కేవలం ఒకట్రెండు సార్లు తనిఖీలు చేస్తే సరిపోదని, సీజన్ మొత్తం నిరంతరం నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. ఇక నిబంధనలు అతిక్రమించి హానికరమైన రసాయనాలు వాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మార్కెట్లకు వచ్చే పండ్ల నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించడం ద్వారానే ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇవ్వగలం. ఆహార భద్రత అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు.

**మనం ఏం జాగ్రత్తలు తీసుకోవాలి**

మార్కెట్‌లో పండ్లు కొనేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించడం అవసరం. పండు మొత్తం ఒకే రంగులో ఉండి, మరీ ఆకర్షణీయంగా ఉంటే అది రసాయనాలతో పండించిందేమో అని అనుమానించాలి. సహజంగా పండిన పండ్లు అక్కడక్కడా కొంచెం పచ్చగా, కొంచెం పసుపుగా ఉంటాయి. పండ్లు తెచ్చిన తర్వాత వాటిని కనీసం అరగంట పాటు నీళ్లలో నానబెట్టి, బాగా కడిగిన తర్వాతే తినాలి. వీలైతే విశ్వసనీయమైన రైతుల వద్ద లేదా ఆర్గానిక్ స్టోర్లలో పండ్లను కొనుగోలు చేయడం ఉత్తమం.

ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు.. అందుకే కేవలం రంగును చూసి పండ్లను కొని మోసపోకండి. మనం కొంచెం జాగ్రత్తగా ఉంటే, మన కుటుంబాన్ని ఈ రసాయన ముప్పు నుంచి కాపాడుకోవచ్చు. అధికారులు, వ్యాపారులు, ప్రజలందరూ బాధ్యతగా ఉంటేనే ఈ వేసవిలో తియ్యని మామిడి పండ్లను నిశ్చింతగా ఆస్వాదించగలం.

# కేరళ ఓటరు తీర్పు ఎటు?


(మొదటి పేజీ తరువాయి)

2016 నుంచి కొనసాగుతున్న ఎల్‌డీఎఫ్ పాలనకు ఇప్పుడు మూడోసారి అవకాశం దక్కుతుందా? లేక మళ్లీ పాత ట్రెండ్‌కు తిరిగి వెళ్తారా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది.

ఈసారి ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఒక కీలక అంశంగా కనిపిస్తున్నప్పటికీ, అది ఎంతవరకు ప్రభావం చూపుతుందన్నది స్పష్టంగా లేదు. ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, సంక్షేమ పథకాల చెల్లింపుల్లో ఆలస్యం వంటి అంశాలు ప్రభుత్వంపై కొంత వ్యతిరేకతను పెంచాయి. కుంభకోణాలు, అవినీతి ఆరోపణలు, కస్టోడియల్ మరణాలు, శాంతిభద్రతల సమస్యలు కూడా ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే మరోవైపు కోవిడ్ మహమ్మారి, వరదల వంటి సంక్షోభ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొన్న ప్రభుత్వం అనే ఇమేజ్ ఎల్‌డీఎఫ్‌కు ప్లస్‌గా మారుతోంది.

ఎల్‌డీఎఫ్ బలాల్లో సంక్షేమ పథకాలు ముఖ్యంగా నిలుస్తున్నాయి. పింఛన్లు, ఆరోగ్య సేవలు, సామాజిక భద్రతా కార్యక్రమాలు ప్రజల్లో మంచి స్పందనను తెచ్చుకున్నాయి. బలమైన క్యాడర్ వ్యవస్థ, పినరాయి విజయన్ నాయకత్వం కూడా ఆ కూటమికి కీలక ఆధారాలు. అయితే నిర్ణయాల్లో కేంద్రీకృత విధానం, ఆర్థిక నిర్వహణలో లోపాలు, పెరుగుతున్న అప్పులు వంటి అంశాలు ప్రతికూలంగా మారుతున్నాయి.

ఇక ప్రతిపక్ష యూడీఎఫ్ పరిస్థితి కూడా అంత సులభం కాదు. సంస్థాగత బలం, అనుభవజ్ఞులైన నాయకత్వం, స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయాలు యూడీఎఫ్‌కు బలం చేకూరుస్తున్నాయి. అయితే కూటమిలో అంతర్గత విభేదాలు, నాయకత్వ పోటీ, అభ్యర్థుల ఎంపికలో తలెత్తిన సమస్యలు ఇబ్బందికరంగా మారాయి. అభివృద్ధి విషయంలో స్పష్టమైన దార్శనికత లేకపోవడం అనే విమర్శ కూడా యూడీఎఫ్‌ను వెంటాడుతోంది. ఇంకా ఒక ముఖ్యమైన అంశం ఎన్డీయే పాత్ర. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చే అవకాశమున్న ఎన్డీయే, యూడీఎఫ్‌కు నష్టం కలిగించే అవకాశం ఉంది. ఫలితాలపై ప్రభావం చూపే అంశంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



**ప్రాధన్యతలు మారుతాయా..?**

ఈ ఎన్నికల్లో ఓటర్ల ప్రాధాన్యతలు కూడా మారుతున్నట్లు కనిపిస్తోంది. ఉచితాల కంటే సుపరిపాలన, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతులు, ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలపై ప్రజలు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. స్థానిక సమస్యలు, అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ట, వారి పనితీరు కూడా ఫలితాలను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా మారాయి. మొత్తంగా చూస్తే కేరళ అసెంబ్లీ ఎన్నికలు ఈసారి కేవలం అధికార మార్పిడి పోటీ మాత్రమే కాదు. ఇది ప్రభుత్వ పనితీరు vs ప్రభుత్వ వ్యతిరేకత మధ్య జరిగే కీలక సమరం. పినరాయి విజయన్ మంత్రం మూడోసారి పని చేస్తుందా? లేక ప్రజలు మార్పుకు మొగ్గు చూపుతారా? అన్నది తేలాల్సి ఉంది. కేరళ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికలు దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

# రెండు కౌన్సిళ్లకే రేవంత్‌పై వ్యతిరేకతా?!

(మొదటి పేజీ తరువాయి)

ఇక మరో వైపు చూస్తే, కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీకి ఎదురైన సవాళ్లు కూడా తక్కువేమీ కావు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవకపోవడం, కీలక ఉపఎన్నికల్లో పరాజయాలు, అంతర్గత విభేదాలు వంటి అంశాలు పార్టీపై ప్రభావం చూపాయి. ఇలాంటి సమయంలో వచ్చిన ఈ రెండు మునిసిపల్ విజయాలు పార్టీకి మానసికంగా కొంత బలం ఇచ్చాయనడం తప్పు కాదు. అయితే ఈ విజయాలను అతిశయోక్తిగా చూపించడం రాజకీయ వ్యూహం మాత్రమేనని తేలిపోతుంది. కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. రెండు స్థానాల్లో ఓటమి చవిచూసినంత మాత్రాన ప్రభుత్వంపై ప్రజా విశ్వాసం తగ్గిందని చెప్పడం హాస్యాస్పదమని వారు అంటున్నారు. వారి వాదనలో కూడా కొంత వాస్తవం ఉంది. ఎందుకంటే ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం సాధారణంగా పెద్ద ఎన్నికల్లోనే స్పష్టంగా కనిపిస్తుంది.

మొత్తానికి ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో ఒక ఆసక్తికర దశను సూచిస్తోంది. ఒకవైపు చిన్న విజయాలను, పెద్ద విజయాలుగా ప్రాజెక్ట్ చేసే ప్రతిపక్షం, మరోవైపు వాటిని తగ్గించి చూపించే అధికార పార్టీ, ఈ రెండు వైఖరులు రాజకీయాల్లో సాధారణమే, కానీ అసలు పరీక్ష మాత్రం ముందున్న ఎన్నికల్లోనే ఉంటుంది. ప్రస్తుతం చూస్తే ఈ రెండు మునిసిపల్ ఫలితాలు రాజకీయంగా ఒక సంకేతం కావచ్చు కానీ దానిని రాష్ట్రవ్యాప్తంగా వ్యతిరేకతగా భావించడం తొందరపాటు నిర్ణయం అవుతుంది. ప్రజల నిజమైన తీర్పు ఎప్పటిలాగే పెద్ద ఎన్నికల వేదికపైనే వెలువడుతుంది.

# ఒక్క ఫొటో వంద మాటల పెట్టు

ముద్ర, న్యూస్ బ్యూరో:

వంద మాటల పెట్టు.. ఒక ఫొటో రూపం అని, జర్నలిజం ఒక మహావృక్షమైతే అందులో ఫొటో జర్నలిస్టులు ప్రాణంలాంటి వారని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ (టీఎస్పీజెఏ) ఆధ్వర్యంలో 23వ ఉత్తమ ఫోటో జర్నలిస్ట్– 2025 అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం హైదరాబాద్, నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యాలయంలోని ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి టీఎస్పీజెఏ రాష్ట్ర అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఎం.వెంకయ్య నాయుడుతో పాటు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఐఎన్టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యుడు దేవులపల్లి అమర్, ఐజెయు జాతీయ ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాం నారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రిపోర్టర్ కలం పెడితే, ఫొటో జర్నలిస్టు కళను బంధిస్తారన్నారు. తాను 1964లో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నప్పటి నుంచి ఫొటో జర్నలిస్టులతో అనుబంధం ఉందన్నారు. ప్రపంచంలో భాషాలు ఎన్నైనా ఉండొచ్చు కానీ, ఏ భాషతో సంబంధం లేకుండా ఉండేది కేవలం ఫొటోగ్రఫీ మాత్రమేనని గుర్తు చేశారు. ఒక వ్యాసం చెప్పలేని భావాన్ని ఒక ఫొటో చెబుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గతంతో పోల్చితే ప్రస్తుత జర్నలిజంలో చాలా మార్పులు వచ్చాయన్నారు. ప్రస్తుత 'ఏఐ టెక్నాలజీ' అన్ని రంగాలకు చాలా ఉపయోగకరంగా మారిందని అన్నారు. ఫొటో జర్నలిస్ట్ కూడా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని, ప్రస్తుత ఏఐ రంగంలో ఎలా ముందుకెళ్లాలో చర్చించుకుందామని సూచించారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ అక్షర సత్యానికి ఊపిరి పోసే సాధనమే ఫొటో జర్నలిజం అని అన్నారు. ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ నేరుగా తీసిన ఫోటోలోని సహజతత్వం, కృత్రిమంగా చిత్రీకరించిన చిత్రాలకు ఉండబోదన్నారు.




ఈ సందర్భంగా ఫొటోగ్రఫీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఫొటోజర్నలిస్టులకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిని ఇందు శ్రీనివాస్(ఈనాడు, నిజామాబాద్), రెండో బహుమతి ఎ.క్రిష్ణ (హాన్స్ ఇండియా, హైదరాబాద్), తృతీయ బహుమతి జి.బాలస్వామి (సాక్షి, హైదరాబాద్)కి అందజేశారు. అలాగే మరో పది మంది ఫొటో జర్నలిస్టులు ఎన్.రాజేష్(సాక్షి,హైదరాబాద్), జి.శ్రీనివాస్ (నమస్తే తెలంగాణ, హైదరాబాద్), ఎ.జాన్ (సాక్షి, హైదరాబాద్), ఆర్.రాజు (సాక్షి, ఖమ్మం), పి.వాసప్రసాద్(సాక్షి, వరంగల్), ఎం.శ్రీనివాస్(ది హన్స్ ఇండియా, నల్లగొండ), జి.వేణుగోపాల్(సాక్షి, జనగాం), ఎం.అనిల్ కుమార్ (ఆంధ్రజ్యోతి, హైదరాబాద్), వీరగోని.రజనీకాంత్ గౌడ్(నమస్తే తెలంగాణ,హైదరాబాద్), ఎ.జ్వల కోటేశ్వర్ రావు (ఆంధ్రజ్యోతి, హైదరాబాద్)లకు అందజేశారు. టి.ఎస్.పి.జె.ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నరహరి, ఉపాధ్యక్షుడు పి. రామ్మూర్తి, కోశాధికారి కె.అనిల్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి. వసంత్ కుమార్, ఎం.ఏ. సర్వర్, పి. మోహన చారి, అలీముద్దీన్, పి. హరి కృష్ణ, ఏ. మహేష్ కుమార్, నేతలు బషీరుద్దీన్, టి. వి. రమణ, రాజ్ కుమార్, పి. వెంకటేష్, గోపి, జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడులో పవన్ కళ్యాణ్ ప్రచారం

## భారీగా బహిరంగ సభల్లో పాల్గొంటున్న నేత విజయ్ కి పోటీగా రంగంలోకి

ముద్ర, డెస్క్:

ఈ నెలలో తమిళనాడు లో సార్వత్రిక ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగనున్నాయి. అన్ని రాజకీయ పార్టీలు హోరాహోరీగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాయి. ఈ ఎన్నికల్లో తమిళ సూపర్ స్టార్ విజయ్ టీవీకే కూడా పోటీ చేయబోతున్న సంగతి తెలిసిందే. విజయ్ విస్తృతంగా ప్రచారం చేస్తూ హోరెత్తిస్తున్నాడు. ఆయన ఈ ఎన్నికల్లో గెలుస్తాడో లేదో తెలియదు కానీ, ఆయన సభలకు, రోడ్ షోలకు జనాలు సునామీలా తరలివస్తున్నారు. ఇదే ఇప్పుడు తమిళనాడు లో హాట్ టాపిక్ గా మారింది. అయితే ఇప్పుడు విజయ్ కి పోటీగా పవన్ కళ్యాణ్ కూడా తమిళనాడు ఎన్నికల ప్రచారం చేయబోతున్నాడు. రేపు ఆయన ఎన్నికల ప్రచారం కోసం తమిళనాడుకు వెళ్తున్నాడు. బీజేపీ పార్టీతో పొత్తులో ఉన్న సందర్భంగా ఆ పార్టీ తరుపున ఆయన ప్రచారం చేయనున్నాడు. నాగర్ కోయల్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఎంఆర్‌గాంధీకి మద్దతుగా పవన్ కళ్యాణ్ ప్రచారం చేయబోతున్నాడు. కేవలం ఆ ఒక్క ప్రాంతంలోనే కాదు, తమిళనాడులో తెలుగు వారు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పవన్ కళ్యాణ్ తో బీజేపీ ప్రచారం చేయించనుంది. ఈయన సభలకు, రోడ్ షోలకు అక్కడి జనం ఎలా స్పందిస్తారో చూడాలి. మహారాష్ట్ర ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ప్రచారం చేసినప్పుడు ఆయనకు అక్కడి జనాలు బ్రహ్మరథం పట్టారు. ఆ ప్రాంతంలో ఎన్డీఏ కూటమి సంచలన విజయం సాధించేందుకు పవన్ కళ్యాణ్ కూడా ఒక కారణమయ్యాడు. తమిళనాడులో కూడా జనాలు ఆ స్థాయిలో బ్రహ్మరథం పడుతారో లేదో చూడాలి. మొదటి నుంచి పవన్ కళ్యాణ్ కు తమిళనాడులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఖచ్చితంగా విజయ్ తో సమానంగా పవన్ కళ్యాణ్‌కు కూడా జనాలు భారీగా తరలి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం తమిళనాడు లో కూడా ప్రధాన పోటీ ఎన్డీఏ, ఇండియా కూటమి మధ్యనే ఉంది. ఎన్డీఏ కూటమికి పవన్ కళ్యాణ్ వల్ల చాలా ప్లస్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆయన ఉపన్యాసాలు యూత్ ఆడియన్స్ లో బలమైన ప్రభావం చూపిస్తాయి. కాబట్టి ఎన్డీఏ వేవ్ పవన్ వల్లే మొదలవుతుందని అక్కడి రాజకీయ విశ్లేషకులు బలంగా నమ్ముతున్నారు. అంతే కాదు పవన్ కళ్యాణ్ తమిళంలో కూడా అద్భుతంగా మాట్లాడగలరు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ కంటే బాగా మాట్లాడగలడు అని, ఆయన తమిళ ఇంటర్వ్యూ కింద కామెంట్స్ లో కొంతమంది నెటిజెన్స్ కామెంట్స్ చేశారు. మరి రేపటి ఎన్నికల ప్రచారంలో ఎలా మాట్లాడబోతున్నాడో చూడాలి.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
06.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## అమెరికా నేవీ సీల్ అంటే అర్థం

SEAL అంటే Sea, Air, Land అని అర్థం. అంటే సముద్రం, గగనం, భూమి మూడు రంగాల్లో ఆపరేషన్లు చేస్తారు.





# జగ్జీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర, ఖమ్మం:** బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లి, ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆ మహనీయుని స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం ప్రజా రంజక పాలన అందిస్తోందని చెప్పారు. భారత మాజీ ఉప ప్రధాని, బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఖమ్మంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి భట్టి విక్రమార్క పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేయడంలో బాబు జగ్జీవన్ రామ్ పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రిగా ఆయన తీసుకున్న విధాన పరమైన నిర్ణయాలు ఈనాటికీ పాలకులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. రక్షణ శాఖ మంత్రిగా, ఇతర ఏ శాఖ బాధ్యతలు చేపట్టినా.. ఆ శాఖకు సరికొత్త ఔన్నత్యాన్ని తీసుకువచ్చిన గొప్ప పరిపాలనాదక్షుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. దేశంలో సామాజిక సమానత్వం, మార్పు కోసం జగ్జీవన్ రామ్ అనేక పోరాటాలు చేశారన్న ఆయన దేశ భవిష్యత్తుకు ఆయనో దిక్సూచిలా నిలిచారన్నారు. అత్యంత పేదరికం, వెనుకబాటుతనం నుంచి వచ్చినప్పటికీ.. తన కృషితో దేశంలోనే అత్యున్నత స్థానాలకు ఎదిగారన్నారు. అధికారాన్ని అనుభవించడానికి కాకుండా, దేశ ప్రజల సంక్షేమం కోసం తన జీవితాన్ని ధారపోశారని ఆయన గుర్తు చేశారు. రాజకీయాల్లోకి వచ్చే ప్రతి ఒక్కరికీ బాబు జగ్జీవన్ రామ్ జీవితం ఒక పాఠమని, ఆయనది నిరంతరం ప్రగతిశీలమైన పంథా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామదాసు నాయక్, కోరం కనకయ్య, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, డీసీసీ మాజీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్తు పాల్గొన్నారు.

# సిక్ కేర్ గా మారిన హెల్త్ కేర్

- డా.యెల్దండి

**ముద్ర, హైదరాబాద్:** మన దేశంలో హెల్త్ కేర్ సిక్ కేర్ గా మారిందని మెంటర్ హెల్త్ లీడర్‌షిప్, యాంటీమైక్రోబియల్ స్టీవార్డ్‌షిప్ నిపుణుడు డా. యెల్దండి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కొండాపూర్ లోని ఇంద్రజిత్ గుప్తా హాల్ లో నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం, ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా ప్రజా వైద్యం, మెడికల్ కాలేజ్ ల ప్రైవేటీకరణ, వాటి పరిణామాలపై సెమినార్ నిర్వహించారు.



ఈ సమావేశానికి నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం డైరెక్టర్ డా. టి. సురేష్ బాబు అధ్యక్షత వహించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. బుర్రి రంగా రెడ్డి మోడరేటర్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా డా.యెల్దండి పబ్లిక్ హెల్త్, మెడికల్ ఎడ్యుకేషన్ పై మాట్లాడారు. తాను ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో చదువుకున్నానని తెలిపారు. ఆ విద్య తనకు ప్రజలకు సేవ చేయడానికి అవకాశం కల్పించిందన్నారు. ప్రస్తుతం మెడికల్ విద్య ఖర్చులు అధికంగా ఉండటం వల్ల, వైద్యులు ఆ ఖర్చులను తిరిగి సంపాదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రోగులు ప్రత్యేక ఆసుపత్రుల్లోకి వెళ్లి అనేక పరీక్షలు చేయించుకోవడం వల్ల వారి జేబులు ఖాళీ అవుతున్నాయని తెలిపారు. ఏఐ, మెడికల్ టూరిజం, రోబోటిక్స్, డయాగ్నస్టిక్ హెల్త్‌టెక్ స్టార్టప్‌లు, కార్పొరేట్ హాస్పిటల్ చైన్లు పెరుగుతున్న కొద్దీ ఖర్చులు మరింత పెరుగుతున్నాయన్నారు. అనంతరం అలర్జీ నిపుణుడు డా. అరిఫ్ అహ్మద్జీ వనశైలి కారణంగా వచ్చే వ్యాధులపై మాట్లాడారు. ప్రకృతి దగ్గరగా జీవించడం, స్థానికంగా లభించే సంప్రదాయ ఆహారాలను తీసుకోవడం మంచిదని సూచించారు. సీఆర్ ఫౌండేషన్ గౌరవ చైర్మన్ డా. కె. నారాయణ, వైద్య నిపుణులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు బ్యాంకు కోసం
# రాముడిని విమర్శిస్తారా?

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ శ్రీ రాముని పేరును రాజకీయాల్లోకి లాగడం, వారి దిగజారుడు తనానికి నిదర్శనమని బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాం నాథ్ విమర్శించారు. ఆదివారం పట్టణంలో రావుల రాంనాథ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ శనివారం నిర్మల్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమావేశంలో మాట్లాడుతూ రాముడికి బీజేపీలో సభ్యత్వం ఉన్నదా? దేశ స్వాతంత్ర పోరాటంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారా? అనటం దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ సారి బీజేపీ ఎమ్మెల్యేలు గెలిచారు, మళ్లీ గెలువరని పిచ్చి కూతలు కూయటం తగదన్నారు. కేవలం కాంగ్రెస్ కార్యకర్తల మెప్పు కోసం ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం భావ్యం కాదన్నారు. రాముడు ఏ యుగంలో ఉన్నారో మహేష్ కుమార్ కు తెలియదా అని ప్రశ్నించారు. కేవలం మైనారిటీ ఓట్ల కోసం హిందూ సంస్కృతిని, చరిత్రను మరిచిపోయి సోయి లేకుండా



మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ బలిరామ్ హెడ్గేవర్ కాంగ్రెస్ నాయకత్వంలో ఎందరో మంది స్వాతంత్ర సమరయోధులతో కలిసి పోరాటం చేసింది మర్చిపోయారా? అని ప్రశ్నించారు. బీజేపీ కంటే ముందుగా జనసంఘ్ అధ్యక్షుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ జమ్మూ కాశ్మీర్ కోసం పోరాటం చేసి ప్రాణ త్యాగం చేసింది కాంగ్రెస్ మరిచిపోవడం తగదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీజేపీకి కంచుకోట అని స్పష్టం చేశారు. బీజేపీ ప్రతి ఎన్నికల్లో గెలవడం ఖాయమన్నారు. నీతులు మాని ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం పనిచేస్తే బాగుంటుందని హితవు పలికారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ జింక సూరి, మాజీ కౌన్సిలర్లు పొడెల్లి గణేష్, నాయకులు పూదరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలు మారడం బట్టలు మార్చినంత ఈజీ కాదు

- ఎంపీ ఈటల సంచలన ప్రకటన


**ముద్ర, కరీంనగర్/ మల్కాజిగిరి:** పార్టీలు మారడం బట్టలు మార్చినంత ఈజీ కాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన శామీర్‌పేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించి ఐదేళ్లు పూర్తయ్యాయని, ఆ తర్వాత బీజేపీలో చేరానని గుర్తు చేశారు. ఇటీవల తాను మళ్లీ పార్టీ మారబోతున్నానని వస్తున్న ప్రచారాన్ని ఖండించారు. తన గురించి తెలంగాణ సమాజానికి పూర్తిగా తెలుసన్నారు. తాను ఎప్పుడూ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని చెప్పారు. బీఆర్ఎస్‌లో తాను ఉన్న కాలంలో అనేక మంది అభిమానులు, పరిచయాలు ఏర్పడ్డాయని, కానీ తిరిగి కేసీఆర్‌తో కలుస్తాననే ప్రచారం పూర్తిగా అవాస్తవమని తేల్చిచెప్పారు. తాను, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ బీజేపీని వీడి ఇతర పార్టీలోకి చేరుతున్నట్లు



జరుగుతోన్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. "ఇలాంటి పిచ్చి ప్రచారాలను నమ్మొద్దు" అని ప్రజలకు సూచించారు. తనను పార్టీ నుంచి బర్తరఫ్ చేయడమే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఇబ్బందులకు గురిచేశారని కేసీఆర్‌పై ఆరోపించారు. తన కోళ్ల ఫారమ్ లు కూల్చివేయడం, భూములను ఆక్రమించడం వంటి చర్యలు జరిగాయని గుర్తు చేశారు.

**కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం..**

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఎంపీ ఈటల రాజేందర్ ప్రకటించారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు నానా రకాలుగా ఇబ్బందులుపడ్డారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత వస్తోందని విమర్శించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగర ప్రజల్లో కాంగ్రెస్ పై నమ్మకం సడలిపోయిందన్నారు. ముఖ్యంగా 'హైడ్రా' పేరుతో పేదల ఇళ్లను కూలగొట్టడం అరాచకమని ధ్వజమెత్తారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై సుప్రీంకోర్టులో కేసు వేస్తామని వెల్లడించారు. ఆరుగురు ఎంపీలు, తమ ఎమ్మెల్యేలతో కలిసి త్వరలో ప్రజా కార్యక్రమాలు చేపడతామన్నారు. మొదటి కార్యక్రమంగా "చలో బాలాజీ నగర్" నిర్వహించాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు బీజేపీ ఇప్పట్నుంచే సమాయత్తం అవుతోందని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలతో చర్చిస్తున్నట్లు తెలిపారు. మొత్తంగా ఈటల రాజేందర్ తన ప్రెస్‌మీట్ ద్వారా పార్టీ మార్పులపై వస్తున్న ప్రచారానికి చెక్ పెట్టడంతో పాటు, బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు.



# ఖానాపూర్ బీజేపీ హస్తగతం

- ముగిసిన మున్సిపల్ చైర్మన్ ఎన్నిక
- కాంగ్రెస్ కు ఝలక్ ఇచ్చిన బీఆర్ఎస్, బీజేపీ
- బీఆర్ఎస్ మద్దతుతో పీఠం దక్కించుకున్న కమలం

**ముద్ర, తెలంగాణ బ్యూరో/ నిర్మల్:** కొన్ని రోజులుగా ఉత్కంఠగా మారిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ఎట్టకేలకు ముగిసింది. బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో బీజేపీ ఖానాపూర్ మున్సిపాలిటీని ఆదివారం కైవసం చేసుకుంది. బీఆర్ఎస్, బీజేపీ చెరో నాలుగు స్థానాల్లో గెలవగా.. కాంగ్రెస్ మూడు, ఒక స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. అయితే కాంగ్రెస్ పార్టీకి ఇండిపెండెంట్, ఎక్స్ అఫీషియో మద్దతు తెలపగా.. బీజేపీ, బీఆర్ఎస్ కలిపి చైర్ పర్సన్ పదవిని దక్కించుకున్నాయి. ఖానాపూర్ పురపాలక సంఘంలో మొత్తం 12 కౌన్సిలర్ స్థానాలు ఉండగా.. అందులో బీఆర్ఎస్ పార్టీ 4, బీజేపీ 4, కాంగ్రెస్ పార్టీ 3, స్వతంత్రులు ఒక స్థానంలో గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీకి స్వతంత్ర అభ్యర్థి మద్దతు తెలపడంతో పాటు.. ఎక్స్ అఫీషియో సభ్యుడి ఓటుతో.. ఆ పార్టీకి బలం ఐదుకు చేరింది. ఈ నేపథ్యంలోనే ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ లభించలేదు. ఈ క్రమంలోనే బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటించడంతో.. ఈ రెండు పార్టీల బలం 8కి చేరింది. దీంతో బీజేపీ తరపున చైర్ పర్సన్ అభ్యర్థిగా ఉన్న అంకం మౌనికకు మద్దతుగా బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన ఏడుగురు అభ్యర్థులు సభ్యులు చేతులెత్తడంతో ఎన్నిక ముగిసింది. ఇక వైస్ చైర్మన్ గా బీఆర్ఎస్ పార్టీ తరపున బరిలో నిలిచిన మహ్మద్ సోయల్ విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్, జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ప్రత్యేక అధికారి జీవరత్నం, ఆర్డీవో రత్నకళ్యాణి, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యేక ఆకర్షణగా శివంగి మహిళా టీం..**

ఎస్పీ జానకి షర్మిల స్వయంగా పర్యవేక్షించిన భద్రతా ఏర్పాట్ల కారణంగా పరిసర ప్రాంతాలు పోలీసు పహారాలో ఉన్నాయి. ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహించిన శివంగి మహిళా టీం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎస్పీ జానకి షర్మిల తో పాటు, అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జీవితాంతం పోరాడిన జగ్జీవన్ రామ్

- కేంద్ర మంత్రి బండి సంజయ్

**ముద్ర, కరీంనగర్:** సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేత జగ్జీవన్ రామ్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. కరీంనగర్ లో ఆదివారం జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంచిర్యాల చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ చిన్ననాటి నుంచే కుల వివక్షను ఎదుర్కొన్నారని తెలిపారు. గ్జీవన్ రామ్ 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల నుంచి 1986 వరకు నిరంతరం పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగడం ఆయన ప్రజా సేవకు నిదర్శనమన్నారు. కేంద్రంలో దాదాపు 29 సంవత్సరాలు మంత్రిగా సేవలందించి, దేశ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీ వెంట నడిచిన జగ్జీవన్ రామ్, రాజకీయాల్లో అజాతశత్రువుగా నిలిచారని కొనియాడారు. జగ్జీవన్ రామ్ జీవితం నుంచి మూడు ముఖ్యమైన సందేశాలు తీసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. కష్టాలను జయించి ఎదగడం, బలహీన వర్గాల కోసం నిలబడడం, దేశ సేవను పరమ ధర్మంగా భావించడం ఆయన బోధించిన మార్గాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చిత్రా మిశ్రా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు సహా పలువురు ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**మేయర్ క్యాంపు కార్యాలయ ప్రారంభం..**

అనంతరం తీగలగుట్టపల్లిలో మేయర్ కొలగాని శ్రీనివాస్ క్యాంపు కార్యాలయాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రజా సమస్యలపై చర్చించి, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



# ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచాలి

- డీజీపీ శివధర్ రెడ్డి

**ముద్ర, శేరిలింగంపల్లి:** ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డీజీపీ బి.శివధర్ రెడ్డి పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. సైబరాబాద్ సీపీ ఆఫీస్ ఆడిటోరియంలో ఆదివారం డీజీపీ బి.శివధర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ పరిస్థితులు, క్రైమ్స్ తదితర అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ బి. శివధర్ రెడ్డి ట్రాఫిక్ భద్రతపై కీలకమైన సూచనలు చేశారు. అలైవ్ అరైవ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 నుంచి 18 వరకు రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రత అనేది కేవలం నిబంధనల అమలు మాత్రమే కాదని, అది ఒక బాధ్యతగా ప్రతి పౌరుడికి తెలిసేలా ఈ అవగాహన కార్యక్రమాలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం సాంకేతికతను ఆసరాగా



చేసుకుని కేటుగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని, వీటి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ సైబరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఐటీ కారిడార్ వంటి ముఖ్య ప్రాంతాల్లో కమిషనరేట్ పరిధి విస్తరించి ఉందని తెలిపారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు చేసి 23 సంవత్సరాలు పూర్తయిన సందర్భం గా వివిధ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. మురికివాడల్లో నివసించే విద్యార్థులు నేరాల బారీన పడకుండా చూసుకోవడం ముఖ్య లక్ష్యమన్నారు. క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి మాట్లాడుతూ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నమోదైన నేరాలను వివరించారు. సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్ మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు గణనీయంగా పెరుగుతున్నాయని తెలిపారు. సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిర్వహణలో పారదర్శకత, ఖర్చు తగ్గింపు, ప్రజల్లో అవగాహన పెంపు లక్ష్యంగా పలు కీలక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ సమయంలో ఐటీ కారిడార్‌లో సుమారు 26 లక్షల వాహనాల రాకపోకలు నమోదయ్యాయని తెలపారు. సాధారణ రోజుల్లో 22 లక్షల వాహనాలు సంచరిస్తున్నాయని చెప్పారు.. పండుగల సమయంలో ట్రాఫిక్ 20 నుంచి 25 శాతం వరకు పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ట్రాఫిక్ డీసీపీ 2 ఎస్. శేషాద్రిని రెడ్డి, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ట్రాఫిక్ డీసీపీ 1 రంజన్ రతన్ కుమార్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# నోరులేని నాలుగు గోడలు!!

స్త్రీకి గౌరవం, రక్షణ కల్పిస్తున్నామన్న మాటే కానీ
ఆమెకు ఇంట బయట మరెక్కడ చోటు లేదు రక్షణ లేదు
ఆమెను దేవతలతో పోలుస్తున్నారే కానీ ఆమె కాళ్ళకు మొక్కిన ఏ ఆనవాళ్లు లేవు
ఆమెను అంగడిలో దొరికే బొమ్మ కాదు అంటున్నారే కానీ
ఆమెను ప్రాణం ఉన్న బొమ్మలెక్క ఆడిస్తున్నది ఈ కూలిపోతున్న సమాజం

ఆమె అగాధాల మధ్య ఉద్భవించిన ఎగసిపడే కెరటం
ఆమె చరిత్ర పుటలను మార్చి రాసేంత మహా మేధావి
ఆ పరాశక్తిని పొట్టన బెట్టుకునే పాపం ఎవరిది!
కట్టుకున్న వాడిదా, ఆమె నమ్మిన నమ్మకానిదా!

కట్టుకున్న వాడే కాలయముడై గొంతులు తెగనరుకుతుంటె
ఆ శాపం ఎవరిది
కడదాక కలిసుంటానని
బాసలు చేసినవాడే
నదిమధ్యలో నెత్తుటి రాతలు రాసేదెందుకో
చేసుకున్న ప్రమాణాలకు విలువెక్కడింది
దాచుకున్న నమ్మకానికి బుజువెక్కడుంది
పెంచుకున్న ప్రేమకు అబద్ధపు రంగులద్ది ఊపిరి తీసేదెందుకో
క్షణికావేశంలో కిరాతకులై
ప్రాణం తీసే కీచకులెందరో

ఈ ఉన్మాదాన్ని అరికట్టేదెన్నడు
స్త్రీకి రక్షణ కల్పించేదెన్నడు
బిడ్డ పానం బోయి కన్నోళ్ల కన్నీళ్ళు దుఃఖపు సెలయేర్లనంటుంతుంటే
ఉన్మాదులు కడుపునిండా తిని కునుకు తీస్తున్నారు

ఈ అసమానత్వం ఇంకెన్నాళ్ళు
మగాడి అహంకారం ఇంకెన్నేళ్ళు
స్త్రీ ఎప్పటికీ రక్తపు మడుగులో కొట్టుకోవాల్సిందేనా
న్యాయదేవత కళ్ళు మూసుకున్నాన్లూ ఈ అరాచకాలకు నాంది పలకాల్సిందేనా
ఈ ఉన్మాదాలకు సాక్షులెవరు
నోరులేని ఆ నాలుగు గోడలేనా..!

**బి.చంద్రకళ**
**ఏం.ఏ తెలుగు**
**హుజూర్ నగర్, సూర్యాపేట.**



# మబ్బులు వీడిపోయేలా చేసిన "పూలపూలవాన"

## కవి డా.ఏనుగు నరసింహారెడ్డి

డా. ఏనుగు నరసింహారెడ్డి కల్లోనికుంట గ్రామం, రామన్నపేట మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఒక ప్రముఖ కవి, రచయిత, సాహిత్య విమర్శకుడు, అనువాదకుడు మరియు ప్రభుత్వ అధికారి. ఆయన ఏనుగు కృష్ణారెడ్డి - లక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. జీవిత భాగస్వామి అరుణ, ఇద్దరు కుమార్తెలు తేజస్విని, గీతాంజలి.

ఆయన డిప్యూటీ కలెక్టర్గా సేవ చేస్తూ సాహిత్య రంగంలో క్రియాశీలకంగా ఉన్నారు. 2017 డిసెంబర్ 15 నుండి 2019 (కొన్ని సూచనల ప్రకారం 2020 వరకు) తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి కార్యదర్శిగా పనిచేశారు. ఈ కాలంలో అకాడమీని సక్రమంగా నడిపి, తెలంగాణ సాహిత్యాన్ని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారు. తర్వాత భాషా - సాంస్కృతిక శాఖ డైరెక్టర్ వంటి బాధ్యతలు కూడా నిర్వహించారు.


ఆయన సాహిత్య ప్రయాణం వచన కవిత్వంతో మొదలై పద్యం, రుబాయిలు, నాటకాలు, వ్యాసాలు, నవలలు, అనువాదాలు వరకు విస్తరించింది.


**ప్రముఖ రచనలు:**

సమాంతర స్వప్నం (1990), నేనే (2002), మట్టిపాట (2008), కొత్తపలక (2012), హైద్రాబాద్ విషాదం (2016), పూలపూలవాన, నీడల దృశ్యం (2021) మొదలైనవి. రాష్ట్రోద్యమ కాలంలో వచన కవిత్వం, పాటలు రాశారు. ఆయన రచనలు సమాజ హితం, మానవీయత, ప్రకృతిఅంతరంగ సమ్మేళనం, గ్రామీణ జీవితం వంటి అంశాలపై దృష్టి సారిస్తాయి. పూలపూలవాన (2022, పాలపిట్ట బుక్స్ / సంబంధిత ప్రచురణ) సంపుటి మొత్తం సమీక్ష

ఈ సంపుటి 285 ముక్తకాలు లాంటి చిన్న కవితల సమాహారం. పెద్ద కావ్యాలు కాకపోయినా, ఇవి పూల వాన లాగా పాఠకుల మనసును తడిపి, సుగంధం నింపుతాయి. కవి స్వయంగా ఇలా వివరించారు: కొత్త ప్రదేశాలు, కొత్త వ్యక్తులు, కొత్త అనుభవాలు, ప్రకృతి ఎదురైనప్పుడు రాలిన "ఊహల ముత్యాలు"ను భావ రమణీయకతతో పట్టుకున్నారు.

**ప్రధాన లక్షణాలు:**




సరళత మరియు మృదుత్వం, వ్యావహారిక భాష, సంభాషణాత్మక శైలి. పూలు మాట్లాడినట్లు ఉంటాయి.

థీమ్స్: ప్రకృతిమానవ సమ్మేళనం, అంతరంగ లోతు vs బాహ్య వైశాల్యం, గ్రామీణ తెలంగాణ జీవితం (తాటి చెట్లు, ఊరు దృశ్యాలు, గౌడుల శ్రమ), తాత్వికత, పసిపాపల నవ్వులాంటి ఆర్ద్రత, జీవిత ప్రవాహం.

**గ్రామీణ స్పర్శ: కవి స్వంత ఊరు (కల్లోనికుంట) నుండి వచ్చిన అనుభవాలు**

- తాటి చెట్టు ఎక్కి చూసిన లోకం, శ్రమజీవుల జీవనం.

**విమర్శకుల అభిప్రాయం:**

గోపగాని రవీందర్ గారు ఆసియానెట్ సమీక్షలో - "కొందరి కవిత్వం ద్రవింపజేస్తుంది, కొందరి ఉత్తేజపరుస్తుంది. రెండూ కలిసిన కవిత్వం ఏనుగు నరసింహారెడ్డిది. ఆధునిక తెలంగాణ కవిత్వంలో మానవీయ ఆర్ద్రతకు అచ్చమైన దాఖలా."

ఈ సంపుటి ఆయన ఇతర రచనలతో (రుబాయిలు, వచన కవిత్వం) పోలిస్తే మరింత లఘు, మధురమైన, సున్నితమైన మార్గం. రోజువారీ ఒత్తిడుల్లో మనసును తాజా చేసే పూలవానలా ఉంటుంది.

నాకు నచ్చిన నిర్దిష్ట కవితల లోతైన విశ్లేషణ
పూలపూలవాన (శీర్షిక కవితా భావం)
1.ప్రకృతి పూసిందని కాదు
పాప నవ్విందని కురిసింది పూలపూలవాన

**పై ముక్తకం సంపుటికి హృదయం.**

ప్రకృతి అందం బాహ్యం కాదు - పసిపాప నవ్వు ద్వారా మానవ భావంగా మారుతుంది. "పూలపూలవాన" పునరుక్తి సుగంధం, తాజాదనం, ఆర్ద్రతను సృష్టిస్తుంది. కవి ప్రకృతిని మానవీయం చేసి, పాఠకుడిని బాల్య సున్నితత్వానికి తీసుకెళ్తారు.

2.ఆకాశం vs అంతరంగం (తాత్వికం)
అంత విశాలమంటారా ఆకాశాన్ని ఆనందంతో గంతులేయడానికి
అంతరంగమంత పెద్దదేది
నాకింతవరకు కనపడనే లేదు

బాహ్య వైశాల్యం (ఆకాశం)ను అంతరంగ లోతుతో పోల్చి, మనసు అపారతను హైలైట్ చేస్తుంది. ఆనందం శారీరకమానసికంగా చిత్రిస్తుంది. కవి అంటారు: బయటి ఎత్తు కంటే లోపలి లోతు గొప్పది. ఇది సంపుటి లోతైన భావాలకు ప్రతీక.

మా ఊరి ఎవరెస్టు (గ్రామీణ నాస్టాల్జియా)
3.ఊరిని లాంగ్‌షాట్‌లో
గీతన్నకు చూపించడమే కాదు
మాకు లోకాన్ని ఊపి ఊపి చూపిస్తది
మా ఊరి ఎవరెస్టు

తాటి చెట్టు ఎక్కి చూసిన గ్రామ దృశ్యాన్ని ఎవరెస్టుతో పోల్చడం అద్భుత ఉపమానం. "లాంగ్‌షాట్" ఆధునిక స్పర్శ ఇస్తుంది. గ్రామం కేవలం ఊరు కాదు - మొత్తం లోకాన్ని (ఆకాశం, దూరాలు) బయటపెడుతుంది. కవి బాల్య స్మృతులు, మూలాల పట్ల గాఢ అనుబంధాన్ని వ్యక్తం చేస్తారు.

గౌడు చెట్టెక్కి (గౌడ్స్ / తాటి ఎక్కేవారి జీవనం)
4.గౌడు చెట్టెక్కి
చుక్కల్ని చూస్తాడు
మోకు విప్పి అంపశయ్యపై పవళిస్తాడు.

గౌడులు (తాటి ఎక్కి కల్లు తీసే కార్మికులు) రోజువారీ జీవితం సాహసం. "చుక్కల్ని చూస్తాడు" - రాత్రి ఆకాశం చూసి విశ్రాంతి లేదా కష్టాల మధ్య సౌందర్యం చూడడం. "మోకు విప్పి అంపశయ్యపై పవళిస్తాడు" - శారీరక అలసట, నొప్పి, ఆలస్యమైన విశ్రాంతిని సున్నితంగా చిత్రిస్తుంది. కవి గ్రామీణ శ్రమజీవుల బాధను ఆర్ద్రంగా, సౌందర్య దృష్టితో వ్యక్తం చేస్తారు. ఇది సంపుటిలో సామాజికమానవీయ కోణాన్ని బలపరుస్తుంది - ప్రకృతి సౌందర్యం శ్రమతో ముడిపడి ఉంటుంది.

5.పారితే సరిపోయే కాలువ (జీవిత ప్రవాహం)
పారితే సరిపోయే కాలువ
పాట కూడా పాడుతుంది

నది/కాలువ ఉపమానం ద్వారా జీవితాన్ని వివరిస్తుంది. ప్రవాహం (కొనసాగడం) జీవితానికి పాటలా సంతోషం ఇస్తుంది; ఆగడం ఉపయోగకరం కావచ్చు కానీ సృజనాత్మకం కాదు. శ్రమజీవుల ఆకలిపోరాటాన్ని సూచిస్తూ "ఆగకుండా ముందుకు సాగాలి" అనే సందేశం ఇస్తుంది. ప్రకృతి నుండి జీవిత పాఠం తీసుకుని సామాజిక ఆర్ద్రతను కలిపి రాశారు.

**ముగింపు**

పూలపూలవాన కేవలం కవిత్వం కాదు - గ్రామీణ తెలంగాణ జీవితం, ప్రకృతి సౌందర్యం, మానవీయ ఆర్ద్రత మరియు తాత్విక లోతును కలిపిన మనసును తాజా చేసే పూలవాన. డా. ఏనుగు నరసింహారెడ్డి గారి సాహిత్య సేవ (అకాడమీ కార్యదర్శిగా మరియు వైవిధ్యమైన రచనలు)తో పాటు ఈ సంపుటి ఆయన సృజనాత్మకతకు మరో మైలురాయి. తెలుగు కవిత్వ ప్రేమికులు, ముఖ్యంగా గ్రామీణ ప్రకృతి ఇష్టపడేవారు తప్పక చదవాల్సిన పుస్తకం.



**-సాధన. తేరాల, ఖమ్మం**

# కేరళ రాజకీయ ప్రస్థానం: సామాజిక విప్లవం నుండి ఆధునిక అభివృద్ధి నమూనా వరకు



1957 సంవత్సరంలో భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక విశిష్ట ఘట్టం ఆవిష్కృతమైంది. స్వాతంత్ర్యం అనంతరం తొలి దశలోనే దేశ రాజకీయాల్లో ప్రధానంగా జాతీయ కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగుతున్న సమయంలో, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ఒక కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి రావడం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఆ చారిత్రక సంఘటన కేరళ రాష్ట్రంలో చోటుచేసుకుంది. భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ రాజకీయ విప్లవానికి నాయకత్వం వహించినవారు ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రపంచంలోనే తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం ఇదేనని చరిత్రకారులు గుర్తిస్తారు.

ఇది కేవలం ఒక పార్టీ విజయం మాత్రమే కాదు, శతాబ్దాల తరబడి పేరుకుపోయిన సామాజిక అసమానతలపై సామాన్యుడు సాధించిన సంచలనాత్మక విజయం.భారతదేశ రాజకీయ పటంలో కేరళ రాష్ట్రానిది ఒక ప్రత్యేకమైన గుర్తింపు. వైవిధ్య భరితమైన భౌగోళిక పరిస్థితులు, అత్యధిక అక్షరాస్యత, విలక్షణమైన సామాజిక చైతన్యం కేరళను దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా నిలబెట్టాయి.

1950వ దశకంలో కేరళ సామాజిక చిత్రం అత్యంత క్లిష్టంగా ఉండేది. భూస్వామ్య వ్యవస్థ వేళ్లూనుకుని ఉండటం వల్ల సామాన్య రైతాంగం తీవ్ర దోపిడీకి గురయ్యేది. కుల వివక్ష పరాకాష్టకు చేరుకుని, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలు సమాజాన్ని పీడిస్తున్న నేపథ్యంలో, అణగారిన వర్గాల్లో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడ్డాయి. ఈ తరుణంలో కమ్యూనిస్టు సిద్ధాంతాలు శ్రామిక వర్గాల్లో ఆశలు రేకెత్తించాయి. ఎలమకుళం మనక్కల్ శంకరన్ నంబూద్రిపాద్ (ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్) వంటి మేధావి నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీ క్షేత్రస్థాయిలో ప్రజలను సమీకరించింది. దీని ఫలితంగానే 1957లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ 126 స్థానాల్లో 60 స్థానాలను కైవసం చేసుకుని, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తద్వారా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రపంచపు మొట్టమొదటి కమ్యూనిస్టు ప్రభుత్వంగా ఇది చరిత్ర పుటల్లోకెక్కింది.

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నంబూద్రిపాద్ అద్భుతమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా భూసంస్కరణల చట్టం ద్వారా భూస్వాముల గుప్పిట్లో ఉన్న వేల ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు, భూమి లేని పేదలకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులకు దారితీసింది. అదేవిధంగా, విద్యా రంగంలో ప్రైవేట్ యాజమాన్యాల గుత్తాధిపత్యాన్ని తగ్గించి, ప్రభుత్వ నియంత్రణను పెంచుతూ విద్యా సంస్కరణల బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, ఈ విప్లవాత్మక మార్పులు సమాజంలోని పెత్తందారీ వర్గాలను, మతపరమైన సంస్థలను కలవరపెట్టాయి. చర్చిలు, నాయర్ సర్వీస్ సొసైటీ వంటి సంస్థలు ఏకమై ప్రభుత్వంపై 'విమోచన సమరం' పేరుతో ఆందోళనలు చేపట్టాయి. ఈ అశాంతిని సాకుగా చూపుతూ 1959లో అప్పటి కేంద్ర ప్రభుత్వం వివాదాస్పదమైన ఆర్టికల్ 356ను ప్రయోగించి, నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసింది. ఇది భారత ఫెడరల్ వ్యవస్థలో ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోయినప్పటికీ, ఆ ప్రభుత్వం వేసిన అభివృద్ధి పునాదులు మాత్రం చెక్కుచెదరలేదు.

1960వ దశకంలో కమ్యూనిస్టు పార్టీలో సంభవించిన చీలిక ఫలితంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ఆవిర్భవించింది. ఆ తర్వాతి కాలంలో కేరళ రాజకీయాలు రెండు ప్రధాన ధ్రువాల చుట్టూ తిరగడం ప్రారంభమైంది. ఒకటి సిపిఐ(ఎం) నాయకత్వంలోని లెఫ్ట్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (LDF), రెండోది కాంగ్రెస్ నాయకత్వంలోని యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (UDF). ఈ రెండు కూటముల మధ్య జరిగిన పోరు కేరళ ఓటర్లలో అద్భుతమైన చైతన్యాన్ని నింపింది. 1980 నుండి 2016 వరకు కేరళ ఓటర్లు ఒక విలక్షణమైన తీర్పును ఇస్తూ వచ్చారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాన్ని మార్చడం అక్కడ ఒక అనవాయితీగా మారింది. ఒకసారి ఎల్.డి.ఎఫ్ గెలిస్తే, మరుసటి ఎన్నికల్లో యు.డి.ఎఫ్ గెలవడం ద్వారా ఏ పార్టీ కూడా అధికార మదంతో విర్రవీగకుండా ప్రజలు అదుపు చేస్తూ వచ్చారు. ఈ మార్పు కేవలం రాజకీయ మార్పు మాత్రమే కాదు, పాలనలో జవాబుదారీతనం కోరే ప్రజల ఆకాంక్షకు ప్రతీక.

ఈ సంప్రదాయాన్ని 2021 ఎన్నికలు సమూలంగా మార్చివేశాయి. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ ప్రభుత్వం, తన ఐదేళ్ల పాలనలో ఎదుర్కొన్న సవాళ్లను సమర్థవంతంగా తిప్పికొట్టింది. వరుసగా సంభవించిన ప్రళయకాల వరదలు, నిపా వైరస్ విజృంభణ, ఆపై కోవిడ్19 మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రదర్శించిన చొరవ ప్రజల మనసు గెలుచుకుంది. ముఖ్యంగా 'కేరళ మోడల్' అభివృద్ధిలో భాగంగా ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం, సంక్షేమ పింఛన్లను ఇంటికే చేరవేయడం, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించడం వంటి చర్యలు పినరయి విజయన్ కు భారీ ప్రజాదరణను తెచ్చిపెట్టాయి. ఫలితంగా 2021 ఎన్నికల్లో 140 స్థానాలకు గాను 99 స్థానాలు గెలుచుకుని, నాలుగు దశాబ్దాల 'ప్రత్యామ్నాయ పాలన' రికార్డును తిరగరాస్తూ వరుసగా రెండోసారి LDF ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

ప్రస్తుత కేరళ రాజకీయాల్లో LDF, UDFల మధ్య ప్రధాన పోటీ కొనసాగుతున్నప్పటికీ, భారతీయ జనతా పార్టీ (BJP) తన ఉనికిని చాటుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. శబరిమల వివాదం వంటి అంశాలను ఆధారం చేసుకుని హిందూ ఓటు బ్యాంకును ఆకట్టుకోవాలని చూస్తున్నప్పటికీ, కేరళలో ఉన్న బలమైన లౌకికవాదం మరియు సామాజిక చైతన్యం వల్ల బీజేపీ ఇప్పటికీ అక్కడ మూడవ స్థానానికే పరిమితమవుతోంది. అయితే ఆ పార్టీ ఓట్ల శాతం క్రమంగా పెరుగుతుండటం భవిష్యత్తులో త్రిముఖ పోటీకి దారితీసే సూచనలు కనిపిస్తున్నాయి.

కేరళ సాధించిన విజయాల వెనుక 'అధికార వికేంద్రీకరణ' అతిముఖ్యమైన పాత్ర పోషించింది. 1996లో ప్రవేశపెట్టిన 'పీపుల్స్ ప్లానింగ్ క్యాంపెయిన్' ద్వారా అభివృద్ధి నిధులను నేరుగా స్థానిక సంస్థలకు (పంచాయితీలకు) బదిలీ చేయడం వల్ల గ్రామీణ స్థాయిలోనే సమస్యలు పరిష్కారమయ్యే సంస్కృతి ఏర్పడింది. నేడు కేరళ మానవాభివృద్ధి సూచికలో (HDI) నార్వే, స్వీడన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతోంది. నూటికి నూరు శాతం అక్షరాస్యత, తక్కువ శిశు మరణాల రేటు, మెరుగైన లింగ నిష్పత్తి కేరళను దేశానికే మార్గదర్శిగా నిలిపాయి.

అయితే, ఈ ప్రగతి పథంలో సవాళ్లు కూడా లేకపోలేదు. కేరళ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా విదేశీ వలసదారుల (ముఖ్యంగా గల్ఫ్ దేశాల నుండి) ఆదాయంపై ఆధారపడి ఉంది. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా వలసలు తగ్గితే తలెత్తే ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న నిరుద్యోగిత, మరియు రాష్ట్రం ఎదుర్కొంటున్న భారీ అప్పుల భారం ఆందోళన కలిగిస్తున్నాయి. పారిశ్రామికీకరణ ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల విద్యావంతులైన యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు లేదా దేశాలకు వలస పోవాల్సి వస్తోంది. అలాగే పర్యావరణపరంగా సున్నితమైన పశ్చిమ కనుమల రక్షణ మరియు తరచూ సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలు పాలనలో పెను సవాళ్లుగా మారాయి.


ముగింపుగా చెప్పాలంటే, 1957లో నంబూద్రిపాద్ వేసిన సామాజిక న్యాయ బీజం నేడు మహావృక్షమై కేరళకు రక్షణ కవచంలా నిలిచింది. కమ్యూనిస్టు భావజాలం మరియు ప్రజాస్వామ్య విలువలు సమ్మిళితమై సామాన్య మానవుడి జీవితంలో మార్పును ఎలా తీసుకురావచ్చో కేరళ నిరూపించింది. రాజకీయం అంటే కేవలం అధికార మార్పిడి మాత్రమే కాదు, అది సామాజిక పరివర్తనకు ఒక సాధనం అని కేరళ చరిత్ర చాటి చెబుతోంది. భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక, ఉపాధి సవాళ్లను ఈ రాష్ట్రం ఎలా అధిగమిస్తుందో చూడాలి గానీ, భారత ప్రజాస్వామ్య ప్రయోగశాలలో కేరళ ఎప్పటికీ ఒక ప్రకాశవంతమైన నక్షత్రంలానే ఉంటుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా స్పందించే పాలన, పౌర చైతన్యం ఉన్నంత కాలం కేరళ తన విశిష్టతను కాపాడుకుంటూనే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్**
**ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**



# అక్షరాలు లేకపోతే...
# (అక్షరమే ఆయుధం)

అక్షరాలు లేకపోతే —
నిశ్శబ్దమే నిత్యసహచరమౌతుంది
అక్షరాల అర్థాలులేని లోకంలో
అనుభవాలూ ఆవేదనలే మిగులుతాయి.
అక్షరాలు లేకపోతే —
ఆలోచనలు అణగిపోతాయి
మనసులో మాటలు ముడుచుకుని
మౌనమే మాటలుగా మారిపోతుంది.
అక్షరాలు లేకపోతే —
ప్రపంచపు పుటలన్నీ మూసుకుపోతాయి
జ్ఞానపు జ్యోతి దూరమైపోయి
జీవితం చీకటిలో మగ్గిపోతుంది.
అక్షరాలు లేకపోతే —
పిచ్చివారై అర్థాల్ని అల్లకల్లోలపరుస్తారు
తెలియని దారుల్లో తడబడుతూ
తప్పులనే సత్యాలుగా భావిస్తారు.
అక్షరాలు లేకపోతే —
అవకాశాల తలుపులు మూసుకుపోతాయి
ప్రగతి పథంలో అడుగులు జారిపడి
పరాజయాల పాలవుతారు.
అక్షరాల వెలుగైతే —
అంధకారమే పారిపోతుంది
జ్ఞానపు దీపం వెలిగితే
జీవితం జ్యోతిర్మయమవుతుంది.
అందుకే అక్షరమే ఆయుధం —
అక్షరమే ఆత్మస్వరూపం
అక్షరంతోనే ఎదుగుదల
అక్షరమే మనిషి మహోన్నతి.



**గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్, భాగ్యనగరం.**

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 06-04-2026
www.mudranews.in | @mudranews



**అమెరికా నేవీ సీల్**
**ఒసామా బిన్ లాడెన్ ఆపరేషన్**

2011లో ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చిన ఆపరేషన్‌ను వీరే చేశారు. ఈ మిషన్‌ను ఆపరేషన్ నెప్ట్యూన్ స్పియర్ అని పిలుస్తారు.




# జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి



## - స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

<u>ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:</u>

బాబు జగ్జీవన్ రామ్ వంటి గొప్ప వ్యక్తి సూచించిన మార్గంలో మనమందరం నడవాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలో జరిగిన దివంగత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొని స్పీకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడారు. ముందుగా బిజేఆర్ చౌరస్తాలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి స్పీకర్ ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా, ఎమ్మెల్యే యాదయ్య, ప్రజా ప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, చేవెళ్ల శాసన సభ్యులు కాలే యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, వైస్ ఛైర్మన్ సుధాకర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, ఎస్సీడి డబ్ల్యూఓ జైపాల్ రెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి రామచంద్రయ్య, పుష్పా రాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### జోగులాంబ గద్వాల జిల్లాలో..

<u>ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:</u>

ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి పురస్కరించుకుని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి కలెక్టర్ తో పాటు ఇతర అతిథులు, రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘాల నేతలు ప్రసంగించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ పాటలతో అలరించారు. అలాగే ఐడిఓసి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ పలు ప్రజాసంఘాల నేతలతో కలిసి పూలమాలలు వేసి పూజలు చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, ఎస్సీ సంక్షేమ శాఖ ఈడి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, ఇతర అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

### రంగారెడ్డి జిల్లాలో..

<u>ముద్ర, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ప్రతినిధి:</u>

ఆదివారం హైదరాబాద్లోని నాంపల్లిలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారురు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని అసమానతలు, దురాచారాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామరావు, దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### జగ్జీవన్ రామ్ సేవలు అమోఘం..

**- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

<u>ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:</u>

దేశ ఉప ప్రధానిగా సేవలందించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవలు ఆదర్శనీయమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, కార్పొరేటర్లు శరత్ రెడ్డి, సత్యం, రమేష్ నాయక్, మధు మోహన్, సీనియర్ నాయకులు నరేష్, సిద్ధిక్, అనంత రెడ్డి, ప్రభాకర్,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### బాబు జగ్జీవన్ రామ్ చిరస్మరణీయుడు

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



బాబు జగ్జీవన్ రామ్ చిరస్మరణీయుడని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా , జిల్లా ఎస్పీ శ డి.జానకి , ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సిజె బెనహర్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ సాయి బాబా, ఐఎన్టీయుసి రాములు యాదవ్, కార్పొరేటర్లు సిబి శ్రీపూజిత, ప్రవీణ్ కుమార్, గులాం జహీర్, తాహేర్, అవేజ్ పాల్గొన్నారు.

### మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్‌లో..

<u>ముద్ర, కూకట్‌పల్లి:</u>

బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై, జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని పలు దళిత సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబూజీకి నివాళులు అర్పించారు.

### మల్కాజిగిరిలో..

<u>ముద్ర, మల్కాజిగిరి</u>

బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలు మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో, మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని చింతల్ బస్తీ వద్ద గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కులాంతర వివాహాలు చేసుకున్న ఆరుగురు దంపతులకు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.2.50 లక్షల విలువ గల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను ప్రోత్సాహకంగా అందజేశారు.

అదేవిధంగా దళిత సామాజిక వర్గాలకు విశేష సేవలు అందించిన 40 మంది ప్రముఖులను గుర్తించి, మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి చెందిన దళిత నాయకులకు "దళిత రత్న" అవార్డులను శాలువాలతో సత్కరించి ప్రదానం చేశారు.

### నాగర్ కర్నూల్ లో..

<u>ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:</u>

ఆదివారం నాగర్ కర్నూల్ పట్టణంలోని పాత కలెక్టర్ కార్యాలయం సమీపంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీ కృష్ణ, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పాల్గొని జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్యే డా. వంశీ కృష్ణ, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్క ర్తగా చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

### ప్రభుత్వ ఆసుపత్రిలో..

నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ టి. ఉషారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్.ఎం.ఓ డాక్టర్ రోహిత్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ నిఖిల్, డాక్టర్ అనురాధ, డాక్టర్ సాయికిరణ్, నర్సింగ్ ఆఫీసర్లు అనురాధ, సునిత, భార్గవి, ఎం. ఆనంద్, చందులాల్, హరి, యాదయ్య గౌడ్, జగదీష్, రాజు, కిరణ్, సిబ్బంది నరేష్, సూపర్వైజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి



**● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**

<u>ముద్ర, గద్వాల:</u>

ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం ఉపాధ్యాయులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఎస్టీటీయు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ సీజన్–1 క్రికెట్ టోర్నమెంట్ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు కేవలం బోధనకే పరిమితం కాకుండా, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తూ, స్వయంగా క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని పెంచుతాయన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా గద్వాల జిల్లా ఉపాధ్యాయులు క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని వీరిని స్ఫూర్తిగా తీసుకొని అన్ని జిల్లాలలో కూడా ఉపాధ్యాయ సంఘాలు క్రీడా టోర్నమెంట్లు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్, మాజీ కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ఆంజనేయులు, నాయకులు ముత్యాల రవి, తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం



**- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

<u>ముద్ర, కాప్రా:</u>

కాప్రా డివిజన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. కాప్రా శాంతి కాలనీలో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్ల పనులను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

<u>ముద్ర, కుషాయిగూడ:</u>

చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చెర్లపల్లి బస్ స్టాప్ లో సీనియర్ రాజకీయ నాయకుడు కడియాల పోచయ్య జ్ఞాపకార్థం అపోలో వైద్యశాల సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరంలో హాజరైన 500 మందికి పైగా వైద్యులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి అదనపు పోలీస్ కమిషనర్ వెంకట రమణ, చర్లపల్లి ఐల చైర్మన్ గోవింద్ రెడ్డి, మాజీ చైర్మన్లు కట్టంగూరు హరీష్ రెడ్డి, రోషి రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పావని మణిపాల్ రెడ్డి, సింగి రెడ్డి ధన్ పాల్ రెడ్డి, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, తాటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా 5కే వాక్ థాన్



<u>ముద్ర, శేరిలింగంపల్లి :</u>

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని హాఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని మైత్రి నగర్ కాలనీలో మైత్రి వాకర్స్ క్లబ్ మరియు మైత్రి నగర్ ఫేస్–2 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కె వాక్ థాన్ ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి డీసీ శ్రీమతి శశిరేఖ, తాజా మాజీ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు.

అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

# 'ఆరోగ్య వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి'

<u>ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:</u>

నాగర్ కర్నూల్ జిల్లాలో ఆరోగ్య వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశించారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 6 నుండి 11 వరకు నిర్వహించనున్న ఆరోగ్య వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవికుమార్‌తో పాటు ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష



సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ విభాగాల సమన్వయంతో వారం రోజులపాటు ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 159 మందిపై కేసులు

**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు గత వారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో159 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. కేసుల్లో 137 ద్విచక్ర వాహనాలు, 5 ఆటో రిక్షాలు, 17 కార్లు, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి. ముఖ్యంగా 14 మంది మద్యం అత్యంత ప్రమాదకర స్థాయిలో వాహనాలు నడిపినట్లు గుర్తించారు.

గత వారం (మార్చి 29 నుండి ఏప్రిల్ 4 వరకు) విచారణకు వచ్చిన కేసుల్లో కోర్టు 13 మందికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించగా, ఇద్దరికి జరిమానాతో పాటు సామాజిక సేవ చేయాలని ఆదేశించింది. మరొక 94 మందికి జరిమానాలు విధించింది.

## రాఘవేంద్ర కాలనీలో పాము పట్టివేత

<u>ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:</u>

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీ రోడ్ నెం.1లో ఆదివారం పాము సంచరించడం స్థానికుల్లో భయాందోళనలకు కారణమైంది. కాలనీ వాసులు వెంటనే స్నేక్ క్యాచర్ తేప్ప వంశీకి సమాచారం అందించగా, ఆయన తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని పాము (జేరిపోతు)ను పట్టుకొని డబ్బాలో బంధించాడు. పట్టుకున్న పాములను ప్రకృతి సంరక్షణ దిశగా అటవీ ప్రాంతాల్లో విడిచిపెడతామని వంశీ తెలిపారు. 2013 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 3 వేలకుపైగా వివిధ జాతుల పాములను పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

## రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని కలిసిన ఆర్బిఎల్ సీఈవో

<u>ముద్ర, తాండూర్:</u>

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్బిఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు తాండూర్ ప్రాంత అభివృద్ధి గురించి, రాజకీయ అంశాల గురించి చర్చించుకున్నారు.



## జగద్గిరిగుట్టలో 'ఇంటింటికీ సీపీఐ'




<u>ముద్ర కూకట్‌పల్లి :</u>

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ చేపట్టిన 'ఇంటింటికీ సిపిఐ' కార్యక్రమం రెండో రోజు జగద్గిరిగుట్టలోని బీరప్ప నగర్, దేవమ్మ బస్తీల్లో సాగింది. పార్టీ నాయకులు గల్లీగల్లీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేటి జగద్గిరిగుట్ట సీపీఐ పాతిన ఎర్ర జెండాలు, వేయించిన గుడిసెల ఫలితమేనని నేతలు గుర్తుచేశారు.

ఈ సందర్భంగా తమ సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలని, భవిష్యత్తులో మరిన్ని పోరాటాల ద్వారా వాటిని పరిష్కరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఏసు రత్నం, మండల కార్యదర్శి కే స్వామి, హైమావతి, హరినాథ్, బాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### చలివేంద్రం ఏర్పాటు

**ముద్ర, గద్వాల:** గద్వాల మండలం సంగాల గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కీర్తిశేషులు చెట్టుకింద పార్వతమ్మ జ్ఞాపకార్థం సర్పంచ్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, గ్రామ పెద్దలు అయ్యపు రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

### జనసేన ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**ముద్ర కూకట్ పల్లి:** కూకట్‌పల్లి నియోజకవర్గం, గాయత్రీ నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద కాలనీలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జనసేన నాయకులు పవన్ నాయుడు, ప్రభాకర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సైబరాబాద్ మున్సిపల్ జనసేన పార్టీ కో–ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.

### మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. బిజినపల్లిలోని అంబేద్కర్ చౌరస్తాలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 06.04.2026
www.mudranews.in | @mudranews



**అమెరికా నేవీ సీల్**

**అత్యంత రహస్య మిషన్లు**



నేవీ సీల్స్ గోప్యమైన మిషన్లలో పాల్గొంటారు. చాలా ఆపరేషన్లు ప్రజలకు తెలియకుండా జరుగుతాయి.

# బాబు జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి

**- ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం**



**ముద్ర, కరీంనగర్:** మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం తెలిపారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. డీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులతో కలిసి బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నగరంలోని మంచిర్యాల చౌరస్తాలో గల జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ దళిత సామాజిక వర్గంలో జన్మించిన జగ్జీవన్ రామ్ కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించి దేశ రాజకీయాల్లో కీలక స్థానాన్ని సంపాదించారని కొనియాడారు. కేంద్రంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు రక్షణ, వ్యవసాయ శాఖల మంత్రిగా పనిచేసి దేశాభివృద్ధికి విశేష సేవలు అందించారని గుర్తుచేశారు. అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ దేశానికి అంకితభావంతో చేసిన సేవలు ఇప్పటికీ అట్టడుగు వర్గాల ప్రజలకు మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు.

ఆయన కుమార్తె మీరా కుమార్ కూడా ప్రజాసేవలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆమె తీవ్రంగా కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఎండీ తాజ్, మడుపు మోహన్, పులి ఆంజనేయులు గౌడ్, మల్లిఖార్జున రాజేందర్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, బానోతు శ్రావణ్ నాయక్, ఎక్కురం సికిందర్, వెన్నం రజిత రెడ్డి, పర్వత మల్లేశం, వరాల నరసింగం, వెల్క పల్లి లచ్చయ్య, రాంరెడ్డి, వంగల విద్యా సాగర్, జీడి రమేష్, సలీముద్దీన్, మాదాసు శ్రీనివాస్, నెల్లి నరేష్, స్వప్నశ్రీ, ఊకంటి రవీందర్ రెడ్డి తదితరు నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేసినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ముఖ్య మంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ముఖ్యమంత్రి భద్రతా విభాగం అధికారులతో కలిసి ఏర్పాట్లు, భద్రతా చర్యలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రారంభించనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను సంబంధిత ప్రదేశాల్లో భద్రతా అధికారులకు వివరించారు. అనంతరం ఆలయ ఈవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించి, అధికారులకు వారి బాధ్యతలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

**భారీగా భద్రతా ఏర్పాట్లు: ఎస్పీ**

భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ జి.జానకి షర్మిల మాట్లాడుతూ 500 మంది పోలీసు సిబ్బందిని భద్రతకు నియమించినట్లు తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా అనుమానాస్పద వ్యక్తులపై నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. డ్రోన్ కెమెరాలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయని తెలిపారు. . ఈ సమావేశంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, డిఎస్పీలు రాములు, శ్రీనివాస్, ఏఎస్పీ సాయి కిరణ్, సిబ్బంది ఉన్నారు.

## వృద్ధుడి ఆత్మహత్య

**కోరుట్ల, ముద్ర:**



జీవితం పై విరక్తి చెంది వ్యక్తి మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామానికి చెందిన జంబుక ఆశన్న 78 అనే వ్యక్తి గత కొంతకాలంగా గ్రామ సుంకరీ పని చేసి 2025 జూలై నెలలో రిటైర్డ్ అయి ఇంటి వద్ద ఒక్కడే ఉంటున్నాడు. మృతుడి భార్య 20 సంవత్సరాల క్రితమే మరణించగా ముగ్గురు కుమారులు ఉన్నారు. రిటైర్డ్ అయి ఒంటరిగా బాధపడుతూ, జీవితం పై విరక్తి చెంది ఆదివారం ఉదయం రేకుల షెడ్డు కి ఉరేసుకొని మరణిం చాడు. మృతుడి చిన్న కోడలు మమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఫ్రిజ్ పేలి ఇద్దరి మృతి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ కలెక్టరేట్ సమీపంలో డబుల్ బెడ్ రూం ఇళ్లలోని ఒక ఇంట్లో శనివారం రాత్రి ఫ్రిజ్ పేలింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ విజయ్ తో పాటు మరో మహిళను ఆసుపత్రికి తరలించారు. కాగా వారిద్దరూ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణంగా భావిస్తున్నారు.

# ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి



నిర్మల్ లో నివాళి అర్పిస్తున్న నాయకులు



మహాదేవపూర్ లో నివాళి అర్పిస్తున్న నాయకులు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

కలెక్టరేట్ లో ఆదివారం భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ భారత స్వతంత్ర ఉద్యమంలో విశేష సేవలు అందించారని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడి శంకర్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, డిఈఓ భోజన్న, పరిశ్రమల జిల్లా మేనేజర్ నరసింహ రెడ్డి, యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు,పాల్గొన్నారు.

**మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ..**

మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే జగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి. మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, డీసీసీ ప్రధా న కార్యదర్శి న్యాయవాది గాజుల రవికుమార్, కౌన్సిలర్ కత్తి నరేందర్, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగన్న, లక్ష్మణ్, కోశాధికారి ముత్యం పాల్గొన్నారు.

**మహాదేవపూర్ లో..**

**మహాదేవపూర్, ముద్ర:** బాబు జగ్జీవన్ రామ్ కేంద్ర మంత్రిగా అనేక సేవలు చేశారని జిల్లా గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాబు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సర్పంచ్ హసీనా భాను, ఉత్సవకమిటీ సభ్యులు మెరుగు లక్ష్మణ్, సమ్మయ్య, లింగాల రామయ్య, ఉప సర్పంచ్ శ్రీజ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాలు కొనసాగించాలి



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** మహనీయుల ఆశయాలు కొనసాగించాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని మంచినీళ్ళ బావి దగ్గర షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ , కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడారు. జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కె. రాజ్ కుమార్, జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కమిటి సభ్యులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సంఘం అభివృద్ధికి కృషి చేస్తాం

**కోరుట్ల, ముద్ర:** మున్నూరు కాపు దుబ్బవాడ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు తోట ప్రసాద్, కార్యదర్శి ఆగ సురేష్ లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా తోట ప్రసాద్, కార్యదర్శి గా ఆగ సురేష్, ఉపాధ్యక్షుడిగా నాగుల జైపాల్, క్యాషియర్ గా ఉసికేల లక్ష్మణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా తోట శివ కుమా ర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. దొనికేల నవీన్, దోమకొండ రమేష్, జంగిటి గంగాధర్, అరిగేలా భూమయ్య, శివన్నోళ్ల రాజు, గోల్కొండ నాగరాజు, శ్రీనివాస్, రామ్ రెడ్డి, నునుగొండ చంద్ర మోహన్, గుర్రాల కిషన్, గందే వేణు గోపాల్, విజయ్, దొమ్మటి శంకర్, సిర్ప నవీన్, షేర్ వేణు, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ కు సన్మానం

**కోరుట్ల, ముద్ర:** మున్సిపల్ కౌన్సిలర్ గా గెలుపొందిన దొనికేల శిరీష నవీన్ లను మున్నూరు కాపు దుబ్బవాడ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ మున్నూరు కాపు ల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తోట ప్రసాద్, ఉపాధ్యక్షుడు జైపాల్, కార్యదర్శి ఆగ సురేష్, క్యాషియర్ ఉసికేల లక్ష్మణ్, తోట శివ కుమార్, దోమకొండ రమేష్, జంగిటి గంగాధర్, అరిగేలా భూమయ్య, శివన్నోళ్ల రాజు, దొమ్మటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లన్న జాతర



**కోరుట్ల, ముద్ర:** పట్టణంలోని 6వ వార్డు ఏకిన్ పూర్ లో శ్రీ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ శిరీష శేఖర్ రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో మాజీ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, నాయకులు తెడ్డు విజయ్, ఊరుమడ్ల వెంకటి, కాశి రెడ్డి వెంకటా రెడ్డి, మ్యాదరి లక్ష్మణ్, ఎల్లేందుల శ్రీధర్, బన్న రాజేష్, చొప్పరి శంకర్, జగిలాం భాస్కర్, మ్యాదరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీ ఏర్పాటుపై స్పష్టత వచ్చేనా?

**- నేడు ఆదిలాబాద్ జిల్లాలో సీఎం పర్యటన**
**- విశ్వవిద్యాలయం కోసం ఉమ్మడి జిల్లావాసుల ఎదురుచూపు**



ఆదిలాబాద్ లో సమావేశమైన యూనివర్సిటీ సాధన సమితి (ఫైల్)

**బోథ్, ముద్ర:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుపై స్పష్టత కోసం జిల్లా వాసులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 2025 డిసెంబర్ 4న ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేతలంతా ఏక తాటిపైకి వచ్చి యూనివర్సిటీని ఎక్కడ ఏర్పాటు చేయాలో నిర్ణయం తీసుకొని ప్రభుత్వ సలహాదారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఇంద్రవెల్లి లో ఏర్పాటు చేస్తే బాగుంటుందనేది తన సూచనగా పేర్కొన్నారు. సీఎం ప్రకటనతో దశాబ్దాలుగా యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎదురుచూస్తున్న జిల్లా వాసుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ ప్రాంత విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాల నేతలతో యూనివర్సిటీ సాధన సమితిని ఏర్పాటు చేసుకొని విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులను సైతం కలిశారు. కాగా మరో మారు 2026 జనవరిలో సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా నిర్మల్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీని బాసర లో ఏర్పాటు చేస్తే సౌలభ్యంగా ఉంటుందని చెప్పటం విస్మయానికి గురి చేసింది. దీంతో యూనివర్సిటీ ఏర్పాటు బాసర లోనా లేక ఆదిలాబాద్ జిల్లాలోనా అనే అం శంపై నేటికి స్పష్టత లేదు. సోమ వారమైన ఈ అంశపై సీఎం స్పష్టత ఇస్తారని ఆశిస్తున్నారు.

**యూనివర్సిటీ లేని ఏకైక జిల్లాగా ఆదిలాబాద్..**

రాష్ట్రంలోని పాత పది జిల్లాల్లో ప్రస్తుతం యూనివర్సిటీ లేని ఏకైక జిల్లాగా ఉమ్మడి ఆదిలాబాద్ నిలిచింది. యూనివర్సిటీ లేకపోవడంతో జిల్లా వాసులు ఉన్నత చదువుల కోసం అష్టకష్టాల నడుమ ఉమ్మడి జిల్లాను దాటి వేరే జిల్లాలకు వెళ్తున్నారు. మరి కొంతమంది ఆర్థిక భారం, దూర భారం వల్ల మధ్యలోనే చదువులకు స్వస్తి పలుకుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో పాటు గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. 2008 లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అదే ఏడాది నవంబర్ 17 న జీవో నంబర్ 797 ను విడుదల చేసింది. ఉట్నూర్ లో భూమిని సైతం గుర్తించింది. ఆ తర్వాత జరిగిన పరిణామాల వల్ల ఆది ములుగు జిల్లాకు తరలి పోయింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలలో ఏర్పాటు అవుతుందనుకున్న మైనింగ్ యూనివర్సిటీ కూడా కొత్తగూడెం జిల్లాలో ఏర్పా టు చేశారు. ఇలా జిల్లాలో ఏర్పాటు అవుతా యనుకున్న యూనివర్సిటీలు ఒక్కోటి వేరే జిల్లాలకు తరలిపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత విద్యార్థులకు మంచి విద్యా అవకాశాలు అందుతాయని జిల్లావాసులు కోరుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
06.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews


**అమెరికా నేవీ సీల్: ఒసామా బిన్ లాడెన్ ఆపరేషన్**

2011లో ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చిన ఆపరేషన్‌ను వీరే చేశారు. ఈ మిషన్‌ను ఆపరేషన్ నెప్ట్యూన్ స్పియర్ అని పిలుస్తారు.



# మహనీయుల ఆశయాలు సాధించాలి

- ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి :</u>
మహనీయుల ఆశయాలను మనమంతా ముందుకు తీసుకుని వెళ్లాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రిన్స్ చౌరస్తా వద్ద గల జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డిలతో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రాం ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రత్యేకించి యువతరం, విద్యార్థుల్లో స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ భవిష్యత్తు కోసం, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు జగ్జీవన్ రాం అందించిన సేవలు ప్రతి ఒక్కరికి ఆదర్శమని అన్నారు



రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి మాట్లడుతూ 1971 యుద్ధ సమయంలో రక్షణ శాఖ మంత్రి గా పని చేశారని తెలిపారు. మన రాజ్యాంగం కల్పించిన అవకాశం మేరకే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నిరుపేదల ఆకలి తీర్చేందుకు వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవాన్ని ప్రోత్సహించా రని, అన్ని వర్గాల అభ్యున్నతికి ఆయన కృషి చేశారని తెలిపారు. రాజ్యాంగ సవరణ లో అణగారిన వర్గాలకు న్యాయం చేస్తూ అనేక మార్పులను జగ్జీవన్ రావ్ తీసుకొని వచ్చారని ఆయన తెలిపారు. వివిధ ఎస్సీ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు,డా. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి,జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సాహితీ, మున్సిపల్ ఛైర్మన్ శ్రీవాణి రవికుమార్, వైస్ ఛైర్మన్ మంజుల వెంకటేశ్వర్లు, గ్రంథాలయ ఛైర్మన్ అవేజ్ చిస్తీ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రేఖ బాబురావు, షెడ్యూల్డ్ కులముల సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, వివిధ ఎస్సీ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.






## బాబు జగ్జీవన్ ఆశయాలు సాధించాలి

<u>ముద్ర, తుంగతుర్తి:</u>
సంఘసంస్కర్త, స్వాతంత్ర సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావ్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆదివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాటి కొండ సీతయ్య మాట్లాడుతూ.. భారతదేశంలో అత్యధిక సార్లు పార్లమెంటుకు ఎన్నికైన ఏకైక వ్యక్తి బాబు జగ్జీవన్ రావు అని ఆయన చిన్నతనం నుండే కుల వివక్షత పై ఎన్నో పోరాటాలు చేశారని దళితుల హక్కుల కోసం ఎనలేని కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. ఆయన ఆశ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుండగాని రాములు గౌడ్, తడకమళ్ళ రవికుమార్, గోపగాని రమేష్, బొజ్జ సాయికిరణ్, బొంకురి మల్లేష్, నల్లబిల్లి వెంకటేష్, బొంకూరి మధు, తడకమళ్ళ నరేష్, తడకమళ్ళ అనిల్, తడకమళ్ళ మధు, బొంకూరి సాయి, కడియం గోపి, గడ్డం నితిన్ పాల్గొన్నారు.



## తుంగతుర్తిలో సర్వోత్తమ్ రెడ్డి జన్మదిన వేడుకలు

<u>ముద్ర, తుంగతుర్తి:</u>
రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను తుంగతుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య సారధ్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య మాట్లాడుతూ.. దివంగత నేత రాష్ట్ర మాజీ మంత్రి దామోదర్ రెడ్డి తనయుడు సర్వోత్తమ్ రెడ్డి తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ మరింత మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుమల ప్రగడ కిషన్ రావు, తుంగతుర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పుల రాంబాబు, దేవాలయ ఛైర్మన్ సంజీవ, యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బడుగుల ఆశాజ్యోతి 'బాబు జగ్జీవన్'

- మాజీ ఉప ప్రధాని విగ్రహాన్ని శుభ్రపరిచిన తుంగతుర్తి సర్పంచ్ సాయిబాబు

<u>ముద్ర, తుంగతుర్తి:</u>
సంఘసంస్కర్త స్వాతంత్ర సమరయోధుడు మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా తుంగతుర్తి మండల కేంద్రంలోని జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని స్థానిక సర్పంచ్ మల్లెపాక సాయిబాబు నీళ్లతో కడిగి శుభ్రపరిచారు. అలాగే జగ్జీవన్ రామ్ విగ్రహంతో పాటు పక్కనే ఉన్న అంబేద్కర్ విగ్రహ పరిసరాలను స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి శుభ్రపరిచారు. సాయిబాబా పనితీరు పట్ల తుంగతుర్తి గ్రామస్తులు శభాష్ అంటున్నారు. ఈ సందర్భంగా సాయిబాబా



మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ అట్టడుగు వర్గాల కోసం పోరాడిన వ్యక్తి అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.



## తైక్వాండో క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం

<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి :</u>
తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో భువనగిరిలోని జీనియస్ హైస్కూల్లో ఆదివారం తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కొండ్రెడ్డి శ్రీకాంత్ చీఫ్ ఎగ్జామినేర్ గా పాల్గొని టెస్టులు నిర్వహించి గెలుపొందిన వారికి బెల్టులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. క్రీడాకారులు పంచెస్ విభాగంలో మూవింగ్ సింగల్ పంచ్, మూవింగ్ డబుల్ పంచ్, ఫుల్ హప్ పంచ్, సింగల్ పంచ్, డబ్బులు పంచ్, ట్రిబుల్ పంచ్, నైఫింగ్ పంచ్, సైడ్ షాప్ ఇన్సైడ్ షాప్, హెడ్ హేమర్, బ్లాక్స్ విభాగంలో అప్పర్ బ్లాక్ ,సైడ్ బ్లాక్, లోయర్ బ్లాక్ ఇన్నర్ మిడిల్ బ్లాక్, లోయర్ ఎక్స్ బ్లాక్, అప్పర్ ఎక్స్ బ్లాక్ చేశారని చెప్పారు. కిక్స్ విభాగంలో మూవింగ్ కిక్స్, స్పిన్నింగ్ రౌండర్ కిక్స్, మూవింగ్ ఇన్నర్ ఎడ్జ్ కిక్స్, బ్యాలెన్స్ రౌండస్ కిక్స్, ట్రస్ట్ కిక్, సైడ్ కిక్ ,ఫ్రంట్ సైడ్ కిక్, ఇన్నర్ ఎడ్జ్ కిక్, అవుటర్ ఎడ్జ్ కిక్, రౌండస్ కిక్, టాపింగ్ కిడ్స్, తెకిక్ ఇజం, తెకిక్ హిల్ జాంగ్, తెకిక్ సాంజంగ్, తెకిక్ సజాంగ్, తెకిక్ ఓ జాంగ్ తెకిక్ యుక్జాంక్ విభాగాల్లో బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశామన్నారు.

# నైతిక సిద్ధాంతం ఉంటేనే ప్రజలు ఆదరిస్తారు

<u>ముద్ర, మోత్కూర్:</u>
సైద్ధాంతిక సిద్ధాంతం ఉన్న పార్టీలనే ప్రజలు ఆదరిస్తారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ళ వీరేందర్ గౌడ్, సూర్యపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి అన్నారు. ఆదివారం మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాబియన్ ముగింపు కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ.. పార్టీ నిర్మాణం బూతు స్థాయి నుండి పార్టీని బలోపేతం చేసినప్పుడే పార్టీ అధికారంలోకి రాగలరని అన్నారు. అవినీతికి వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేయటం వలనే భారత దేశంలో బిజెపి అతిపెద్ద పార్టీగా ఆవరించి అధికారంలోకి వచ్చిందని అన్నారు రాబోయే రోజుల్లో తెలంగాణలో కచ్చితంగా బిజెపి పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త సైనికులు వల్లే పనిచేయడం అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం



చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జన గణన సర్వేలో సంక్షేమ పథకాలు ప్రతిష్టంగా అమలు అయ్యేటట్టు బి ఎల్ ఓల కు సహకరించాలని కోరారు. నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి అమలు అయ్యేటట్టు చూడాలని అన్నారు పట్టణ అధ్యక్షులు చాలా మంజుల అధ్యక్షతన నిర్వహించిన ఇట్టి కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వంగవీటి శ్రీనివాస రావు, ప్రశిక్షణ ప్రబారి ,గౌరు శ్రీనివాస్ గుప్తా ,మోత్కూరు రూరల్ మండల అధ్యక్షులు గూడెం మధుసూదన్ రెడ్డి, అడ్డగూడూరు మండల అధ్యక్షులు అనుబోతు సైదులు, జిల్లా నాయకులు కొణతం నాగార్జున రెడ్డి, బయ్యని చంద్రశేఖర్, కూరాకుల వెంకన్న , పోచం సోమయ్య, ఏనుగు జితేందర్ రెడ్డి, మోత్కూరు బ్రహ్మచారి , బిమిడి తిరుమల్ రెడ్డి, బండ నరసింహ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



## సొంతింటి కల సాకారం

<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి :</u>
పేదవాడి సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తుందని జిల్లా కాంగ్రెస్ ఫిషర్ మాన్ అధ్యక్షులు సామల ధర్మరాజు అన్నారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని 2వ వార్డుమాస్కుంటలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గుర్రం అనూష ముత్యాలు నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరై 5000 రూపాయల ఆర్థిక సహాయంతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు షాగంటి రాంచందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షులు తోర్రి సురేష్, ఇందిరమ్మ కమిటి సభ్యులు పోకల యాదగిరి, లతీఫ్, ఇండ్ల లక్ష్మి, లింగాల జంగమ్మ పాల్గొన్నారు.

# ప్రభుత్వ వాగ్దానాలు అమలు చేయాలి

<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి :</u>
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) భువనగిరి మండల అధ్యక్ష , కార్యదర్శులు రాసాల నిర్మల , కొండమడుగు నాగమణి డిమాండ్ చేశారు. ఆదివారం భువనగిరి మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో ఐద్వా ఇంటింటి సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపడితే మహిళలకు నెలనెలా 2500 రూపాయలు ఇస్తామని, పెళ్లి చేసుకున్న ప్రతి ఆడబిడ్డకు కళ్యాణ లక్ష్మి డబ్బులతోపాటు తులం బంగారం ఇస్తానని చెప్పి అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు



గడిచిన ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భూమిలేని ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తానని చెప్పి నేటికీ అమలు చేయడం లేదని అన్నారు. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణము అమలు చేస్తున్న పట్టణాలకు తప్ప గ్రామాలకు ప్రభుత్వ బస్సులు వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో దూసరి మానస, బుగ్గ రేణుక, కొండమడుగు భూమమ్మ, రాసాల వెంకటమ్మ , అన్నంపట్ల మైసమ్మ, రాసాల గ్రహణమ్మ , అన్నంపట్ల భాగ్యమ్మ , కొండమడుగు నవనీత, అన్నంపట్ల తిరుమల పాల్గొన్నారు.



## మహనీయుడు జగ్జీవన్

- ఎమ్మెల్యే మందు ల సామెల్

ముద్ర మోత్కూర్: డాక్టర్ బాబు జగ్జీవన్ రావు జయంతిని పురస్కరించుకొని మోత్కూరు మున్సిపల్ పరిధిలోనీ చెరువు కట్ట వద్ద గల బాబు జగ్జీవన్ రావు విగ్రహానికి తుంగతుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు మందుల సామెల్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషిచేసిన గొప్ప మహానుభావుడు బాబు జగ్జీవన్ రావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ గడ్డం స్వప్న, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, కౌన్సిలర్లు కురిమిళ్ళ ప్రమీల, సుల్తాన్ స్వామి, కొండ శోభ, మొగ్గుళ్ళ అనురాధ, గనగానీ శైలజ, పన్నాల శ్రీవిద్య, బీసు శ్రీకాంత్, కారుపోతుల వెంకన్న, మెంట రమణ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ సాధకుడు బాబు జగ్జీవన్ రావు

<u>ముద్ర, మోత్కూర్:</u>
దేశంలో సామాజిక న్యాయ సాధనకు కృషి చేసిన గొప్ప మహానుభావుడు భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రావు అని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పొన్నె బోయిన రమేష్ అన్నారు. బాబు జగ్జీవన్ రావు జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ పార్టీ అధ్యక్షులు జంగ శ్రీను, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు కొణతం యాకుబ్ రెడ్డి , చిప్పలపల్లి మహేంద్రనాథ్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు కొండ సోంమల్లు, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్, మాజీ సర్పంచ్ లు బయ్యని పిచ్చయ్య బత్తిని తిరుమలేష్, జిల్లా నాయకులు దాసరి తిరుమలేష్, చేల్లోటి నరేష్ పురుగుల మల్లయ్య, జంగ సతీష్,చేతరాశి వెంకన్న, అన్నందాసు విద్య సాగర్, చెడిపల్లి రఘుపతి, కోక బిక్షం కంచర్ల క్రాంతి కుమార్ రెడ్డి పాల్గొన్నారు



# జగ్జీవన్ గొప్ప సంఘ సంస్కర్త

<u>ముద్ర, నడిగూడెం:</u>
భారతదేశ తొలి ఉప ప్రధాని, సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రావ్ 119వ జయంతి వేడుకలు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఎమ్మార్వో సోమగాని సూరయ్య, మండల కేంద్ర సర్పంచ్ దున్న శ్రీనివాస్ హాజరై జగ్జీవన్ రావ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూసుదీర్ఘకాలం బడుగు బలహీన వర్గాల వారికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. జగ్జీవన్ రావు సేవలు చరిత్రలో



శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండా వెంకన్న గుప్తా, బాణాల నాగరాజు, నాగారపు రాము, దున్న ప్రదీప్,చిలకల ఉ ఉపేందర్, బోనగిరి ఉపేందర్, షేక్ రియాజ్,దళిత బహుజన నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**అమెరికా నేవీ సీల్ : అత్యాధునిక ఆయుధాలు**

వీరు అత్యాధునిక ఆయుధాలు, టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన గన్స్, నైట్ విజన్ పరికరాలు వీరి వద్ద ఉంటాయి.



## రాత్రి 11లోపు దుకాణాలు మూసివేయాలి

- డీఎస్పీ ప్రసన్న కుమార్



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ డివిజన్ పరిధిలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా రాత్రి 11 గంటలలోపు అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థలు, ఇతర ఎస్టాబ్లిష్‌మెంట్‌లు తప్పనిసరిగా మూసివేయాలని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ సూచించారు. భద్రతాపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాత్రి 11 గంటల అనంతరం పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తారని, ఆ సమయంలో తెరిచి ఉన్న దుకాణాలు లేదా సంస్థలు గుర్తిస్తే సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు, వ్యాపారులు పోలీస్ శాఖతో సహకరించి ఈ నియమాలను కచ్చితంగా పాటించాలని, అందరూ కలిసి మెదక్ పట్టణంలో శాంతిభద్రతలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## చౌక ధరల దుకాణాన్ని సందర్శించిన కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



నిత్యావసర వస్తువుల పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలోని ఫతేనగర్‌లో చౌక ధరల దుకాణాన్ని సందర్శించారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు అత్యంత పారదర్శకంగా మూడు నెలల రేషన్ పంపిణీ జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 520 రేషన్ దుకాణాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మకుండా, గందరగోళానికి లోనుకాకుండా ప్రశాంతంగా తమకు లభ్యమయ్యే మూడు నెలల రేషన్ సరుకులను పొందాలని సూచించారు. ఏప్రిల్, మే, జూన్ నెలల రేషన్ సరఫరా ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని వెల్లడించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, పౌర సరఫరాల ఇన్స్పెక్టర్ నరసింహులు, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## హత్నూరలో దీన్ దయాళ్ శిక్షణ కార్యక్రమం



**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

సంగారెడ్డి జిల్లా హత్నూరలో ఆదివారం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్, ప్రశిక్షణ మహాభియాన్ హత్నూర మండల ఇన్‌చార్జి, భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి అశోక్ సాదుల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హత్నూర మండల అధ్యక్షుడు నాగప్రభు గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పాపగారి పెద్ద రమేష్ గౌడ్, రాష్ట్ర నాయకుడు బొక్క నరసింహారెడ్డి, మెదక్ జిల్లా సీనియర్ నాయకుడు నందా రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు కవిత, మైనార్టీ మోర్చా నాయకుడు అఫీజ్ భాయ్, హత్నూర మండల సీనియర్ నాయకుడు సతీష్, దౌల్తాబాద్ సర్పంచ్ అభ్యర్థి మహేష్, బోర్పట్ల మల్లేష్, సర్పంచ్ జైపాల్, రామరాజు కవిత తదితరులు పాల్గొన్నారు. మండల స్థాయి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## హనుమాన్ దేవాలయంలో చోరీకి యత్నం

- అపవిత్రం చేశారని ఆరోపణ
- నేడు మెదక్ బంద్‌కు పిలుపు



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ పట్టణం గాంధీనగర్‌లోని హనుమాన్ దేవాలయంలో ఆదివారం తెల్లవారుజామున చోరీకి యత్నం జరిగింది. దుండగుడు ఆలయంలోకి చొరబడి బీరువాను ధ్వంసం చేశాడు. సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలించిన స్థానికులు గాంధీనగర్‌లో నివాసం ఉంటూ, కొల్చారం మండలం వరిగుంతం గ్రామానికి చెందిన అప్సర్ అనే వ్యక్తి ఈ ఘటనకు పాల్పడినట్లు గుర్తించి అతన్ని పట్టుకున్నారు. అతను దేవాలయంలో దొంగతనానికి ప్రయత్నించడంతో పాటు అపవిత్రం చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయని స్థానికులు ఆరోపించారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానికులు, హిందూ సంఘాల బాధ్యులు కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అప్సర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. మెదక్ పట్టణం, పరిసర ప్రాంతాల్లో హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం మెదక్ బంద్‌కు హిందూ సంఘాలు పిలుపునిచ్చాయి. ఇటీవల మెదక్ మండలం మంబోజీపల్లి హనుమాన్ దేవాలయం వద్ద అపవిత్ర ఘటన, మున్సిపల్ పరిధి అవుసులపల్లిలో దేవీదేవతల విగ్రహాల ధ్వంసం జరిగినట్లు పేర్కొన్నారు. తాజాగా గాంధీనగర్ ఘటన నేపథ్యంలో బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ, అవుసులపల్లి ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయని అన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టడి చేయాలని, హిందువుల మనోభావాలను దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ బంధువులు మెదక్ బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొని ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

# బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. దళితుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజు, అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, పీఆర్‌టీయూ మెదక్ జిల్లా అధ్యక్షుడు మేడి సతీష్ రావు, ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు మహేష్ కుమార్, చంద్రశేఖర్, సంతోష్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రతిమా సింగ్ నివాళులు



కలెక్టరేట్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

### కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ నగేష్

మానవతావాది, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సమతావాది డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ నగేష్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో నివాళులర్పించారు. జయంతి సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆటపాటలతో పండుగ వాతావరణం సృష్టించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రిజర్వేషన్లతో విద్యలో రాణించాలని, విద్యతోనే ఏదైనా సాధ్యమని సూచించారు. మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజు బాబూ జగ్జీవన్ రామ్ జీవిత చరిత్రను కవితల రూపంలో వివరించారు. విగ్రహం ఏర్పాటు విషయంలో స్థానిక మెదక్ శాసనసభ్యుడు మైనంపల్లి రోహిత్ రావుతో సంప్రదించి చర్యలు చేపడతామని తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గాల మండల స్థాయి నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్, కార్యదర్శి రాజ్ కుమార్, ఉత్సవ కమిటీ చైర్మన్ డి. సంజీవ్, వైస్ చైర్మన్ జి. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఎమ్మార్పీఎస్ బాలరాజు, సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా పోలీస్ కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఏఆర్ డీఎస్పీ రంగా నాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువతకు స్ఫూర్తిగా నిలిచేలా ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శైలేందర్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో

బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు పేర్కొన్నారు. ఆదివారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం వద్ద బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎం. గంగాధర్, మున్సిపల్ కౌన్సిలర్లు తొడుపునూరి శివరామకృష్ణ, బుజరంపేట అరుణ సిద్ధి రాములు, ఎరుకల నర్సింలు, ఎండి. మన్సూర్ అహ్మద్, నాయకులు కొరివి రాములు, గోదల సాయిరాం, ప్రవీణ్ గౌడ్, సయ్యద్ ఉమర్, ప్రవీణ్, దేవుల నాయక్, స్వరూప, బాలరాజు యాదవ్, నాగరాజు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### రాజకీయాల్లో విశిష్ట సేవలు అందించిన జగ్జీవన్ రామ్ : కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీజీఆర్ చౌరస్తా వద్ద డా. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి హాజరై, దళిత సంఘాల నాయకులతో కలిసి బీజీఆర్ చౌరస్తా వద్ద గల డా. బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్, దళిత సంఘాల నేతలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డా. బాబూ జగ్జీవన్ రామ్ దేశ రాజకీయాల్లో సుదీర్ఘకాలం విశిష్ట సేవలు అందించి, సామాజిక న్యాయ సాధనకు కృషి చేసిన మహానేత అని కొనియాడారు. ఒక నాయకుడు ఉన్నత స్థాయికి ఎదగాలంటే అనేక సవాళ్లను ఎదుర్కొని, సమస్యలను అధిగమించే ధైర్యం అవసరమని పేర్కొన్నారు. డా. బాబూ జగ్జీవన్ రామ్ కేంద్ర ప్రభుత్వంలో అనేక శాఖలకు మంత్రిగా పనిచేయడమే కాకుండా దేశ ఉప ప్రధానిగా కూడా సమర్థవంతమైన సేవలను అందించారని తెలిపారు. ఇదిలా ఉండగా, బీజీఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్వో నాగరాజమ్మ, సిద్దిపేట ఆర్డీవో సదానందం, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి హమీద్, వివిధ సంఘాల నాయకులు బొమ్మల యాదగిరి, బైరి రాజేశం, ఎర్రమహేందర్, లింగంపల్లి శ్రీనివాస్, బయ్యారం ఇస్తారి, పరుశరాములు, డి. శంకర్, భీమసేన, ఎల్లేష్, రామస్వామి, చుంచు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**

భారత మాజీ ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, శాసనసభ్యుడు చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు తదితరులు బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నటరాజ్ థియేటర్ సమీపంలో నిర్వహించిన జయంతి ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, బాబూ జగ్జీవన్ రామ్ చిన్నతనం నుంచే కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, ఉన్నత ఆలోచనలు, కష్టపడి పనిచేయడం, నిబద్ధతకు మారుపేరుగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉండేలా కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, బాబూ జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో యువత సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు, యువత ముందుకు సాగాలని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధకుడని తెలిపారు. దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడి, కేంద్ర మంత్రిగా పలు కీలక బాధ్యతలు నిర్వహించి దేశ అభివృద్ధికి సేవలందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక సారథి కళాకారుల పాటలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి అఖిలేష్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

### వేడుకల్లో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ..



రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ చౌరస్తాలో స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ భారత ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శాసనసభ్యులు తోట లక్ష్మీ కాంతరావు, మందుల శామ్యూల్, నాగరాజు, డా. కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి. హనుమంతరావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, ప్రొఫెసర్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



మెదక్ పురపాలక సంఘంలో నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతిరాజ్



సంగారెడ్డిలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరతోష్ పంకజ్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, చైర్‌పర్సన్ వనిత సంతోష్

# ఘనంగా ఈస్టర్ వేడుకలు



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఈస్టర్ పండుగను పురస్కరించుకుని మెదక్ మహా దేవాలయం (చర్చి) ప్రాంగణంలో ఆదివారం తెల్లవారుజామున 4:30 గంటల నుంచి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గుడ్ ఫ్రైడే రోజు శిలువ వేయబడిన యేసు ప్రభువు మూడో రోజున సమాధి నుంచి లేచి భక్తులకు దర్శనమిస్తాడని విశ్వసిస్తారు. "త్వరలో ఈ లోకానికి వస్తాను, అప్పటి వరకు నేనున్నానని తెలియజేయండి" అనే విశ్వాసంతో క్రైస్తవులు ఈస్టర్ పండుగను జరుపుకుంటారు. ఈస్టర్ పురస్కరించుకుని మెదక్ డయాసిస్ పరిధిలోని జిల్లాల నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో చర్చి ఆవరణ కిక్కిరిసిపోయింది.

- **శిలువ ఊరేగింపుతో వేడుకలు ప్రారంభం**

మెదక్ చర్చి ప్రెస్బిటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో ఉదయం నాలుగున్నర గంటలకు శిలువ ఊరేగింపుతో ఈస్టర్ వేడుకలు చర్చి బయట ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలువకు మహిళలు పెద్ద ఎత్తున కొవ్వొత్తులు వెలిగించి స్మరించుకున్నారు. ఆరాధన, ప్రత్యేక ప్రార్థనలతో చర్చి ఆవరణ మార్మోగింది. చర్చి గురువులు భక్తి గీతాలు ఆలపించారు.

- **సజీవుడైన దేవుడు యేసయ్య..**

మరణాన్ని జయించి తిరిగి సజీవుడైన దేవుడు యేసయ్య అని మెదక్ ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ తెలిపారు. ఈస్టర్ పండుగ సందర్భంగా తెల్లవారుజామున చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని భక్తులకు దైవ సందేశం అందించారు. పాపుల రక్షణ కోసం శిలువపై మరణించి తిరిగి లేచి పరలోకానికి దారి చూపిన దేవుడు యేసయ్య అని పేర్కొన్నారు. శిలువ వెలుగులో రక్షణనిచ్చే దేవుడని తెలిపారు. ప్రపంచానికి ఆరాధ్య దైవం యేసు ప్రభువేనన్నారు. ప్రేమ, కరుణ, దయ, త్యాగం, సేవ, పాప క్షమాపణలకు ప్రతిరూపం యేసు ప్రభువేనన్నారు. భక్తులందరికీ క్రీస్తు యేసు నామమున శుభములు కలగాలని ఆకాంక్షించారు. అంతకుముందు చర్చి ప్రెస్బిటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైనందిన సందేశం అందించారు. ఈ వేడుకల్లో చర్చి పాస్టర్లు డేవిడ్, రిచర్డ్, శ్రీనివాస్, జైపాల్, సీఎస్ సంఘం సభ్యులు గంట సంపత్, జాన్సన్, గెటెడ్ చిత్తరంజన్, సందాన్ సందీష్, జాయముద్రే, సువక్షన్, సునీల్, రోలంజ్‌బాద్ తదితరులతో పాటు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
06.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### అమెరికా నేవీ సీల్ : ఫిట్నెస్ & మానసిక బలం

నేవీ సీల్స్‌కు శారీరక శక్తి మాత్రమే కాదు, మానసిక ధైర్యం కూడా చాలా ముఖ్యం. ఒత్తిడిలో కూడా తీసుకునే సామర్థ్యం ఉండాలి.




# అన్నీ నిజాలే.. దురంధర్.. కేరళ స్టోరీ

- కేరళ గడ్డపై ప్రధాని మోదీ గట్టి కౌంటర్
- వాస్తవాలను చూపించే చిత్రాలపై దుష్ప్రచారం
- ది కేరళ స్టోరీ, ధురంధర్ చిత్రాలకు బహిరంగ మద్దతు
- 'లవ్ జిహాద్' వంటి అంశాలపై ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉంది
- యూసీసీ , ఎస్ఐఆర్ అంశాలపై తప్పడు ప్రచారాలపై ప్రధాని హెచ్చరిక
- సినిమాలు సమాజానికి అద్దం...
- వ్యతిరేకత వెనుక వాస్తవాలను దాచే ప్రయత్నమా?
- దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిన ప్రధాని వ్యాఖ్యలు



**ముద్ర, డెస్క్:**

దేశ రాజకీయ, సినీ వర్గాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారిన అంశం.. సమాజంలోని సున్నితమైన విషయాలను ప్రతిబింబించే సినిమాలపై జరుగుతున్న వివాదం. ముఖ్యంగా ది కాశ్మీర్ ఫైల్స్, ది కేరళ స్టోరీ, తాజాగా వచ్చిన ధురంధర్ వంటి చిత్రాలపై ఒక వర్గం తీవ్ర విమర్శలు గుప్పిస్తుండగా, ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన వ్యాఖ్యలు పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఈ సినిమాల్లో చూపించిన అంశాలను కొందరు అబద్ధాలుగా కొట్టిపారేస్తున్నారని, కానీ వాస్తవాలను సమాజానికి తెలియజేయాలనే ఉద్దేశంతో తీసిన చిత్రాలపై కావాలనే దుష్ప్రచారం జరుగుతోందని ప్రధాని స్పష్టం చేశారు. సమాజంలోని చేదు నిజాలను వెలికి తీసే ప్రయత్నాలను తక్కువ చేసి చూపించడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ది కేరళ స్టోరీ సినిమాను బహిరంగంగా సమర్థించడం రాజకీయంగా కీలక పరిణామంగా భావిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రస్తావించిన అంశాలు.. ప్రత్యేకంగా 'లవ్ జిహాద్' వంటి సున్నిత విషయాలపై దేశంలో జరుగుతున్న చర్చలకు ప్రధాని వ్యాఖ్యలు మరింత ఊపును ఇచ్చాయి. సమాజంలో జరుగుతున్న కొన్ని సంఘటనలపై ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందని ఆయన మాటల ద్వారా సంకేతం వెళ్లిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇక గూఢచారి థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో రూపొందిన ధురంధర్ సినిమాను కూడా ప్రధాని ప్రస్తావించడం విశేషంగా మారింది. ఈ చిత్రంలో చూపించిన సంఘటనలు వాస్తవాల ఆధారంగా తీసుకున్నవేనని, వాటిని కథగా మలచి ప్రజల ముందుకు తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన సినిమాలను విమర్శించే వారికి ఈ వ్యాఖ్యలు గట్టి సమాధానంగా నిలిచాయని సినీ వర్గాలు అంటున్నాయి. సినిమాలకే పరిమితం కాకుండా, దేశ ప్రయోజనాల దృష్ట్యా తీసుకొస్తున్న చట్టాలపై కూడా కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ), ఎస్ఐఆర్ (ఎస్ఐఆర్) వంటి అంశాలపై అపోహలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన హెచ్చరించారు. అభివృద్ధిని అడ్డుకునేందుకు అసత్యాలను వ్యాప్తి చేయడం దేశానికి హానికరమని ఆయన విమర్శించారు. మొత్తంగా చూస్తే, సినిమాలు కేవలం వినోదం మాత్రమే కాకుండా సమాజానికి అద్దం పడే సాధనమని ప్రధాని వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. వాస్తవాలను అంగీకరించలేని వర్గాలే ఇలాంటి చిత్రాలను వ్యతిరేకిస్తున్నారని ఆయన అభిప్రాయపడటం గమనార్హం. ఈ వ్యాఖ్యలు ఒకవైపు సినీ పరిశ్రమలో, మరోవైపు రాజకీయ రంగంలో పెద్ద చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా దేశవ్యాప్తంగా, అలాగే హైదరాబాద్ సహా ఇతర నగరాల్లో జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో 'లవ్ జిహాద్' అంశం మళ్లీ ప్రధాన చర్చగా మారింది. ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలు భవిష్యత్‌లో మరిన్ని రాజకీయ, సామాజిక చర్చలకు దారి తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# దళితుల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్

- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- దళిత హక్కుల పరిరక్షణ సమానత్వ సాధన కోసం కృషి చేసిన మహానుభావుడు
- దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి
- రూ.వంద కోట్లతో అంబేద్కర్ టవర్
- రూ.25 కోట్లతో నింబోలిలో హాస్టల్ నిర్మాణం.



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

దళిత వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సామాజిక న్యాయం, దళితుల హక్కుల పరిరక్షణ, సమానత్వ సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహానుభావుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఎల్బీ స్టేడియం సర్కిల్ లోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి మంత్రులు అట్లూరి లక్ష్మణ్ కుమార్, వివేక్ వెంకటస్వామి, దామోదర రాజనర్సింహ, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు ,మాజీ మంత్రులు మాజీ శాసనసభ్యులు, దళిత సంఘ నాయకులు, సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాల లేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ట్యాంక్ బండ్ ప్రాంతంలో రూ. వంద కోట్లతో అంబేద్కర్ టవర్ ఏర్పాటు చేయడం తో పాటు రూ. 25 కోట్లతో దళిత బిడ్డలకు నింబోలిలో హాస్టల్ ను నిర్మిస్తామని ప్రకటించారు. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన బాబు జగ్జీవన్ రావ్ చరిత్రను ప్రతి ఒక్కరు చదవాలన్నారు. కేంద్రంలో వివిధ మంత్రి పదవులు, ఉప ప్రధానిగా పదవులు చేపట్టి దళితుల అభ్యున్నతికి ఎనలేని సేవలు అందించారన్న ఆయన దళితులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ దళిత హక్కుల పరిరక్షకుడు సామాజిక సమానత్వ శిల్పి జగ్జీవన్ రామ్ అన్నారు. దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను అంది పుచ్చుకోవాలని సూచించారు. దళితులు ఐక్యంగా ఉంటూ తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకున్నారని చెప్పారు. దళితులు విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దళితుల పరిరక్షకుడుగా, వారి అభ్యున్నతికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేపట్టటం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కో చైర్మన్లు డి. సుదర్శన్ బాబు, అల్లిబిల్లి మహేందర్, వైస్ చైర్మన్ లు అనిల్, రోజా రాణి, శ్రీనివాస్, సుదర్శన్, వెంకటేష్, షెడ్యూల్ కుల శాఖ అధికారులు , వివిధ సంఘ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

# సింగరేణి కోసం మరో ఉద్యమం

- అవినీతిపై విచారణ చేపట్టాలి
- రాజస్థాన్ తో సోలార్ ఒప్పందం, లిథియం రిఫైనరీ
- 'అల్ట్ మిన్' అగ్రిమెంట్ లో భారీ అవినీతి
- రూ.2250 కోట్ల ఒప్పందంపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- 'నైనీ' అవినీతి బాగోతం బయట పెట్టినందుకు కార్మికులపై ఆక్రోశం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పై జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్
- "సేవ్ సింగరేణి" రౌండ్ టేబుల్ సమావేశంలో ఐదు తీర్మానాలు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

సింగరేణిలో డిపెండెంట్ కార్మికుల నియామకాల జోలికి వస్తే ప్రభుత్వం తాట తీస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్మికుల నియామకాలపై విజిలెన్స్, ఏసీబీ విచారణ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల అసెంబ్లీలో చేసిన ప్రకటనపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల నియామకాలపై కాదు మీ ప్రభుత్వ అవినీతిపై విచారణకు సిద్ధమా అంటూ సవాల్ చేశారు. నైనీ బ్లాక్ అవినీతి బాగోతాన్ని బయటపెట్టంతోనే కార్మికులపై భట్టి విక్రమార్క ఆక్రోషం పెంచుకున్నారని వారిపై కక్ష తీర్చుకునేందుకే విచారణ అంటూ డ్రామా మొదలు పెట్టారని మండిపడ్డారు. ఆదివారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో "సేవ్ సింగరేణి" రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో సింగరేణి కార్మికులకు జరిగిన నష్టాన్ని కొంత పూడ్చేందుకు గత ప్రభుత్వం కొన్ని సడలింపులతో 20 వేల కార్మికులకు ఉద్యోగాలు ఇచ్చిందని చెప్పారు. సింగరేణి తెలంగాణకు ప్రాణప్రదాయని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సంస్థను కాపాడుకుంటామన్నారు. అవసరమైతే మరో ఉద్యమానికి కూడా సిద్ధమని చెప్పారు. మరో 20 రోజుల్లో రాజకీయ శక్తిగా తాము రాబోతున్నామన్న ఆమె ఈ లోపు ప్రభుత్వం సింగరేణి సమస్యలు పరిష్కరించకపోతే బొగ్గు బాయి బాట పడతామని హెచ్చరించారు.

**విచారణకు సిద్ధమా?**

రాజస్థాన్ ప్రభుత్వంతో సింగరేణి సంస్థ 11 వేల కోట్ల ఒప్పందం చేసుకుందని చెప్పారు. ఒక మెగావాట్ విద్యుత్ కు అయ్యే ఖర్చుకు మూడు రెట్లు ఎక్కువ ఖర్చు పెట్టే విధంగా అగ్రిమెంట్ చేసుకున్నారన్నారు. అదే విధంగా లిథియం రిఫైనరీ అంటూ అల్ట్ మిన్ అనే చిన్న కంపెనీతో రూ. 2250 కోట్ల ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. 27 లక్షలు కూడా ఆదాయం లేని సంస్థతో రూ. 2250 కోట్ల ఒప్పందం ఎలా చేసుకుంటారని ప్రశ్నించారు. ఈ రెండు ఒప్పందాల్లో అడ్డగోలుగా అవినీతి ఉందన్నారు. వీటిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇచ్చే జీతాల కారణంగా సంస్థపై భారం పడుతుందన్నట్లుగా డిప్యూటీ సీఎం మాట్లాడుతున్నారని...కానీ ప్రభుత్వం చేతగానీతనంతో సింగరేణిని సర్వనాశనం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సింగరేణికి దాదాపు రూ. 47 వేల కోట్లు బకాయి ఉందని గుర్తు చేశారు. ఈ బకాయిలు చెల్లించకపోవటంతోనే సంస్థ నిర్వహణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తే ఆ డబ్బుతో వచ్చే వడ్డీతో సంస్థ సజావుగా సాగుతుందన్నారు. చెమట చిందించి సింగరేణిని లాభాల బాట పట్టిస్తున్న కార్మికులకు లాభాల్లో వాటా ఇస్తే తప్పేంటనీ ప్రశ్నించారు. సింగరేణిలో డింపెండెంట్ ఉద్యోగాలు, అలియాస్ పేర్ల అంశం, పాత వీఆర్ఎస్ స్కీమ్ ను కొనసాగించటం, మెడికల్ బోర్డు ఏర్పాటు, గతంలోనే వైద్య పరీక్షల్లో పాసైన 350 మంది అభ్యర్థులకు పోస్టింగ్ లు, ఖాళీగా ఉన్న క్లర్క్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కవిత డిమాండ్ చేశారు.

**ఐదు తీర్మానాలు:**

కేంద్రం లేబర్ కోడ్ కు సంబంధించి తెచ్చిన నాలుగు నల్ల చట్టాలను అమలు చేసేది లేదని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలి. అసెంబ్లీలో తీర్మానం చేయాలి.

మెడికల్ బోర్డును మానవతా దృక్పథంతో ఆలోచించి వెంటనే ఏర్పాటు చేయాలి. పెండింగ్ కేసులు పరిష్కరించాలి.

అలియాస్ నేమ్స్ సమస్యను పరిష్కరించాలి. వీటికి లీగలిటీ వర్తించదు. పొలిటికల్ విల్ ఉంటే సమస్య పరిష్కారం చేయవచ్చు.

సింగరేణి సంస్థ అల్ట్ మిన్ కంపెనీతో కంపెనీతో రూ.2250 కోట్లతో చేసుకున్న ఒప్పందంపై శ్వేత పత్రం విడుదల చేయాలి.

నైనీ, తాడిచర్ల వంటి బొగ్గు గనులను కొత్త వచ్చే గనులను కూడా సింగరేణి సంస్థయే ఆపరేట్ చేయాలి. అని ఐదు తీర్మానాలు చేసినట్లు కవిత చెప్పారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రూపంలో పంపిస్తామన్నారు. లేబర్ కోడ్ కు సంబంధించి కేంద్రం తెచ్చిన నాలుగు నల్ల చట్టాలను బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తమ రాష్ట్రంలో అమలు చేసేది లేదని తేల్చిచెప్పారని గుర్తు చేశారు.

### ప్రభుత్వాన్ని వదలిపెట్టం

సింగరేణి సంస్థను నాశనం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ హెచ్చరించారు. అవసరమైతే మరో ఉద్యమం ద్వారా సంస్థను కాపాడుకుంటామన్నారు. సింగరేణి సంస్థ కోసం జాగృతి, హెచ్ఎంఎస్ చేసే ఏ పోరాటానికైనా తమ మద్దతు ఉంటుందని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సెంట్రల్ కమిటీ మెంబర్ ప్రసాద్ చెప్పారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ ప్రతినిధులు, సింగరేణి కార్మిక సంఘాల నాయకులు హాజరయ్యారు.

# ప్రభుత్వ భూములపై కాంగ్రెస్ కళ్లు

- నాదర్ గుల్ లో రూ.7 వేల కోట్ల భూ స్కాం
- దళితులు, బలహీన వర్గాలపై దౌర్జన్యం
- అక్రమ కేసులు బనాయించి.. బెదిరింపులు
- 2007లోనే వైఎస్ ప్రభుత్వ భూములని ప్రకటించారు
- పదేళ్లు బీఆర్ఎస్ వాటిని కాపాడింది..
- మాజీ మంత్రి హరీశ్ రావు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులు, బలహీన వర్గాల భూములను అధికార పార్టీ పెద్దలు గద్దల్లా తన్నుకుపోతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఒకవైపు పారిశ్రామికవేత్తల ముసుగులో, మరోవైపు కబ్జాల రూపంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక భూ కుంభకోణాలకు పాల్పడుతోందన్నారు. నాదర్‌గుల్‌లోని సర్వే నంబర్ 613 (కొత్త సర్వే నంబర్ 119) లో ఉన్న 373 ఎకరాల భూమిలో రూ.7 వేల కోట్ల భారీ స్కాం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కుంభకోణం వెనుక ప్రభుత్వ పెద్దలు, మంత్రులు ఉన్నారని రక్షకులే భక్షకులుగా మారారని ధ్వజమెత్తారు. నాదర్‌గుల్ భూములను అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 2007లో వీటిని ప్రభుత్వ భూములుగా అసెంబ్లీలో ప్రకటించి ఆంధ్రప్రదేశ్ పరిశ్రమా వనరుల సంస్థ కు అప్పగించారని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ప్రభుత్వం ఈ భూములను కంటికి రెప్పలా కాపాడితే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే రేవంత్ రెడ్డి కన్ను ఈ భూములపై పడిందన్నారు. కౌసల్య, మమత లాంటి మహిళా రైతులు 40 ఏళ్లుగా ఈ భూమినే నమ్ముకుని బతుకుతున్నారని చెప్పారు. వారికి డబ్బులు ఆశచూపి వెళ్లగొట్టాలని చూస్తున్నారన్నారు. బోర్లు, కంచెలు ధ్వంసం చేశారని ఆరోపించారు.

**సుప్రీంకోర్టు ఇదే చెప్పింది:**

ఈ నాదర్‌గుల్ భూములు తనవని శివరాజ్ బహదూర్ అనే వ్యక్తి నిజాం కాలం నాటి మాటలు చెబుతుండగా, 2005లోనే అప్పటి ఆర్డీవో ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టం చేశారని 2017లో సుప్రీంకోర్టు కూడా ఇది ప్రభుత్వానిదేనని చెప్పిందన్నారు. రాష్ట్రంలో ఉన్న ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం ఒక వ్యక్తికి 373 ఎకరాలు ఉండే అవకాశం లేదు. కానీ 2016లో శివరాజ్ బహదూర్ ఈ భూములను ఆల్ఫా, ఒమేగా, యునిటెక్ అనే కంపెనీలకు విక్రయించాడు. చట్టంలోని సెక్షన్ 8, సెక్షన్ 17 ప్రకారం ల్యాండ్ సీలింగ్ డిక్లరేషన్ ఇవ్వకుండా ఈ భూములను అమ్మే హక్కు ఎవరికీ లేదు. ఈ విక్రయాలు చెల్లవని, ఇది సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉంటుందని కందుకూరు ఆర్డీవో తేల్చిచెప్పారు. ఆర్డీవో నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సదరు కంపెనీలు హైకోర్టుకు వెళ్లగా.. ఆర్డీవో నిర్ణయమే సరైనదని, ఈ భూముల క్రయవిక్రయాలు చెల్లవని సింగిల్ బెంచ్ మరియు డివిజన్ బెంచ్ (13102022న) స్పష్టం చేశాయన్నారు. అమ్మిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కూడా కోర్టు సూచించిందని గుర్తు చేశారు. ఇంత స్పష్టంగా కోర్టు తీర్పులు, చట్టాలు ఉన్నప్పటికీ కస్టోడియన్‌గా ఉండి భూములను కాపాడాల్సిన ఆర్డీవో కళ్లు మూసుకున్నారని మండిపడ్డారు. మార్చి 9, 10 తేదీల్లో రైతులు కందుకూరు ఆర్డీవోకు, ఎమ్మార్వోకు, రంగారెడ్డి కలెక్టర్‌కు, చివరకు హైడ్రాకు కూడా గుండాల ఆక్రమణలపై వినతిపత్రాలు ఇచ్చారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.

# యుద్ధం ఎఫెక్ట్.. 864 గంటలుగా ఇంటర్నెట్ బంద్




**ముద్ర న్యూస్ :**

అమెరికాఇజ్రాయెల్‌ల దాడులు మొదలైనప్పటి నుంచి ఇరాన్ దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేసిన సంగతి తెలిసిందే. గత ఐదు వారాలుగా ఈ ఆంక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇంటర్నెట్ పర్యవేక్షణా సంస్థ నెట్‌బ్లాక్స్ అంచనా ప్రకారం.. 864 గంటలపాటు ఏకధాటిగా (36 రోజులపాటు) ఈ సేవలు నిలిపివేసిన దేశంగా ఇరాన్ నిలిచింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో ప్రపంచ దేశాలతో సంబంధాలు తెగిపోయాయి. దేశీయంగా పరిమిత స్థాయిలోనే ఈ సేవలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, మయన్మార్, సూడాన్‌తోపాటు పలు దేశాల్లో సంక్షోభ సమయాల్లో ఇలాంటి ఆంక్షలు విధించిన సందర్భాలు ఉన్నప్పటికీ.. ఇంత సుదీర్ఘ కాలం పాటు ఏ దేశమూ కొనసాగించలేదని నెట్‌బ్లాక్స్ పేర్కొంది. అయితే, ఉత్తర కొరియా మాత్రం ఇంటర్నెట్ ద్వారా ప్రపంచంతో అనుసంధానం కాకుండా మొదటి నుంచీ దూరంగా ఉందని గుర్తు చేసింది.ఉక్రెయిన్, గాజా యుద్ధాల్లో అక్కడి మౌలిక సదుపాయాలు దెబ్బతినడం వల్ల ఇంటర్నెట్ సేవలకు సుదీర్ఘ కాలం అంతరాయం ఏర్పడింది. ఫలితంగా వినియోగదారుల సంఖ్యలో గణనీయంగా తగ్గుదల కనిపించింది. అయినప్పటికీ.. యుద్ధం కారణంగా ఏ దేశం కూడా ఇంటర్నెట్‌ను ఈ స్థాయిలో నిలిపివేయలేదు. అంతేకాదు.. శాటిలైట్ కనెక్షన్లు, వర్చువల్ ప్రైవేటు నెట్‌వర్క్‌ల వంటి ప్రత్యామ్నాయ మార్గాలపైనా ఇరాన్ అధికారులు నియంత్రణ విధించారు. దీంతో పౌరులకు కమ్యూనికేషన్ మార్గాలు లేకుండా పోయాయి.

# నీటి సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్

- సీఎం చంద్రబాబు




**ముద్ర, అమరావతి :**

నీటి సంరక్షణ జలవనరుల పరిరక్షణ అంశాలే అజెండాగా 100 రోజుల కార్యాచరణను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 'నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టనుంది. సోమవారం తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో జరిగే కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో యాక్షన్ ప్లాన్‌పై రాష్ట్రంలోని సాగునీటి సంఘాల సభ్యులతో చంద్రబాబు ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

నీటి పారుదల, అటవీ, పంచాయతీరాజ్, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల సమన్వయంతో 'నీటి భద్రతసాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమం చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 తేదీ వరకు పనుల గుర్తింపు కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ 16 నుంచి 20వ తేదీ వరకు గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వాలని, ఏప్రిల్ 21 నుంచి జులై 9వ తేదీ వరకు పనులను చేపట్టాలని ఆదేశించారు. జులై 10 నుంచి 14 వరకు.. పూర్తి చేసిన పనులకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సూచించారు. సాగునీటి సంఘాలే కేంద్రీకృతంగా ఈ కార్యక్రమాలు అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులకు కీలక బాధ్యతలు అప్పగించారు.

వేసవికి ముందు 6 మీటర్లు, వర్షాకాలం తర్వాత 3 మీటర్ల లోతులో భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఫీడర్ ఛానెళ్లను క్లియర్ చేయడం సహా.. పూడికతీత పనులు చేపట్టాలన్నారు. గుర్రపు డెక్క తొలగించాలని.. చెరువులు, కాల్వలను క్లియర్ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అవసరమైన మేరకు చెక్ డ్యామ్‌లను రిపేర్లు చేయాలని.. కొత్త స్ట్రక్చర్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. సాగునీటి సంఘాలు వాటర్ బడ్జెట్ తయారు చేసుకోవాలని సూచించారు. ప్రజాచైతన్యం, ప్రజల భాగస్వామ్యంతో 100 రోజుల ఉద్యమాన్ని సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
06.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



అమెరికా నేవీ సీల్ : చిన్న టీమ్‌ల్లో ఆపరేషన్స్

వీరు చిన్న టీమ్‌లో పని చేస్తారు. ప్రతి సభ్యుడు బహుళ నైపుణ్యాలు కలిగి ఉండాలి.

# కేరళంలోనూ తెలంగాణ పథకాల అమలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- తెలంగాణలో పారదర్శకంగా, సమర్థవంతంగా ఆరు గ్యారంటీల అమలు
- కేరళంలో ఎల్‌డిఎఫ్ పాలన ప్రజలను నిరాశపరిచింది

**ముద్ర, కేరళం :**

కేరళంలో యూడిఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మాదిరిగానే ప్రజలకు ఇచ్చే ప్రతి హామీని కచ్చితంగా అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కేరళం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మావేలిక్కర అసెంబ్లీ నియోజకవర్గంలో యూడీఎఫ్ అభ్యర్థి ముతర రాజ్‌కు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు గ్యారెంటీలను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుందన్నారు. కేరళంలో యూడిఎఫ్ ప్రభుత్వం ఏర్పడితే ఐదు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కేరళంలో గత పదేండ్లుగా కొనసాగుతున్న ఎల్‌డిఎఫ్ పాలన ప్రజలను నిరాశపరిచిందని ఆయన విమర్శించారు. అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక రంగాల్లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేరళం ప్రజలు ఈసారి స్పష్టమైన మార్పు కోరుకుంటున్నారని అన్నారు. పదేండ్ల అసమర్థ పాలనకు ముగింపు పలికి, అభివృద్ధి, పారదర్శక పాలన కోసం యూడిఎఫ్‌కు అధికారం అప్పగించాలని మంత్రి పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా విభజన రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య విభేదాలు పెంచే బీజేపీకి కేరళంలో స్థానం లేదని ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం యూడిఎఫ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఇది సాధారణ ఎన్నిక కాదన్న ఆయన కేరళం భవిష్యత్తును నిర్ణయించే ఎన్నిక. ప్రజలు సరైన నిర్ణయం తీసుకుని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని గద్దె దించి, యూడిఎఫ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

# ప్రజా ఉద్యమంగా నీటి భద్రత

- నీటి సంరక్షణకు వంద రోజుల ప్రత్యేక యాక్షన్ ప్లాన్


**ముద్ర, అమరావతి :**

రాష్ట్రంలో నీటి భద్రత సాధిస్తేనే ఇతర రంగాల్లో అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రాష్ట్రాన్ని కరవు రహితంగా మార్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. వేసవికల్లా 6 మీటర్లు, వర్షాకాలం ముగిసే నాటికి 3 మీటర్ల లోతులో భూగర్భ జలాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 6వ తేదీ నుంచి చేపట్టే "నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమంపై సాగునీటి సంఘాలు, మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇరిగేషన్, వ్యవసాయం, పంచాయతీరాజ్, అటవీ, పశుసంవర్థక శాఖలు సమన్వయంతో 100 రోజుల కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. ఏప్రిల్ 6 నుంచి జూలై 14 వరకు నాలుగు దశల్లో కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. పనుల గుర్తింపు, అనుమతులు, అమలు, నివేదికల సమర్పణ వంటి దశలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రజలను భాగస్వాములను చేసి నీటి భద్రతను ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వేల గ్రామాల్లో భూగర్భ జలాల కొరత ఉన్నట్లు గుర్తించామని, చెరువులు నింపడం, కాల్వలు శుభ్రపరచడం, చెక్ డ్యాంల మరమ్మతులు, మైక్రో ఇరిగేషన్ అమలు ద్వారా నీటి నిల్వ, పొదుపు పెంచాలని సూచించారు. సాగునీటి సంఘాలు వాటర్ బడ్జెట్, వాటర్ ఆడిట్ నిర్వహించాలని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో చేపట్టిన "ప్రాజెక్టు జలధార" తరహాలో నీటి వనరుల అనుసంధానం చేయాలని, ఈ కార్యక్రమాన్ని అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ప్రారంభిస్తామని సీఎం స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు కలిసి వందరోజుల యాక్షన్ ప్లాన్‌ను విజయవంతం చేయాలని కోరారు.

# ఆ గ్రామాలను భద్రాచలంలో కలపండి

- కేంద్ర మంత్రి అమిత్ షాకు తుమ్మల లేఖ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



భద్రాచలాన్ని ఆనుకొని ఉన్న ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ప్రస్తుతం ఆ గ్రామాలు భౌగోళికంగా, సామాజికంగా భద్రాచలంతోనే అనుసంధానమై ఉన్నాయని ఆ లేఖలో వివరించారు. కానీ ఏపీలో ఉండడంతో పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయన తెలిపారు. పాలనా సౌలభ్యం కోసం వీటిని భద్రాచలంలో కలపాలని కోరారు. ఇలా చేయడం ద్వారా గిరిజనుల సమస్యలు తొలగుతాయన్నారు. గిరిజనుల ఆరోగ్యం, విద్య, రవాణా వంటి ప్రాథమిక సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ఈ గ్రామాలను తెలంగాణలో కలపాలని కోరారు. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే విలీనం బిల్లు పెట్టేలా చూడాలని కోరారు.

**పార్లమెంట్‌లోనూ ప్రస్తావన..**

గత నెల 26న ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుపైన రాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంగా భద్రాచలం ఐదు గ్రామాలు తెలంగాణకే ఇవ్వాలని టీజీ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి కేంద్రాన్ని కోరారు. ఏపీ విభజన హామీలను రాజకీయ అవసరాల కోసం వాడుకుంటున్నారని, హామీలను అమలు చేయనందుకు నష్టపరిహారం చెల్లించాలని ఆమె నిలదీశారు. తెలంగాణకు ఇచ్చిన హామీలను విస్మరించారని, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎన్టీపీసీ హామీలను నెరవేర్చలేదని రేణుకా చౌదరి విమర్శించారు. తెలంగాణకు మొండి చెయ్యి చూపిస్తున్నారని, ఐదు గ్రామాలను తెలంగాణకు ఇవ్వాలని, తెలంగాణలో ఉండాలనుకునే వాళ్లను ఏపీలో కలిపారని ఆమె తెలిపారు.

# బీఆర్ఎస్, బీజేపీలది ఫెవికాల్ బంధం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు లోపాయికారీ ఒప్పందంతో కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన రెండు మున్సిపల్ చైర్మన్ ఎన్నికల ఫలితాలే ఈ అపవిత్ర కలయికకు నిదర్శనమని ఆయన అన్నారు. ఆదివారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఇందులో ఇబ్రహీంపట్నం, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పనిచేశాయని ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఇబ్రహీంపట్నంలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ఇరు పార్టీలు పంచుకున్నాయన్న ఆయన ఆదివారం జరిగిన ఖానాపూర్ ఎన్నికల్లోనూ ఇదే దోస్తీ పునరావృతమైందని అన్నారు. అక్కడ బీజేపీకి చైర్మన్ సీటు ఇచ్చి, బీఆర్ఎస్ వైస్ చైర్మన్ పదవిని తీసుకుందని విమర్శించారు. ఖానాపూర్, ఇబ్రహీంపట్నంలో జరిగింది పొత్తు కాదా? అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఉన్నది విడదీయలేని 'ఫెవికాల్ బంధం' అని ఆది శ్రీనివాస్ అభివర్ణించారు

# బాసరా.. నయనానందకరం

- 9 అంతస్తుల రాజగోపురం... ఈశాన్యంలో కోనేరు
- మూడు రెట్లు పెరగనున్న దేవాలయ విస్తీర్ణం
- రూ.225 కోట్లతో బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునర్నిర్మాణం
- నేడు సీఎం రేవంత్ భూమి పూజ
- శృంగేరి పీఠాధిపతుల అనుమతితో పనులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



దక్షిణ భారతదేశంలోని ఏకైక జ్ఞాన సరస్వతి ఆలయం, అక్షరాభ్యాసాలకు ఆలవాలమైన క్షేత్రం పునర్నిర్మాణంతో కొత్త శోభను సంతరించుకోబోతోంది. వేదవ్యాస మహర్షితో ప్రతిష్ఠతమైన ముగ్గురమ్మల ఆలయం ఆచారాలకు అనుగుణంగా సమున్నత రాజగోపురం, కోనేరు, ఉత్తర ద్వారం అభివృద్ధి, ధ్యాన మందిరాలతో మరింతగా భక్తులను ఆకట్టుకోనుంది. వేల ఏళ్ల ఘన చరిత్ర గల బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.225 కోట్లను కేటాయించింది. పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేడు భూమిపూజ చేయనున్నారు.

**ముగ్గురమ్మల కొలువైన క్షేత్రం**

దక్షిణ గంగగా గుర్తింపు పొందిన పవిత్ర గోదావరి నది తీరంలోని బాసర క్షేత్రంలో జ్ఞాన సరస్వతి దేవి కొలువై ఉన్నారు. కురుక్షేత్ర యుద్ధానంతరం ప్రశాంతత కోసం వేదవ్యాస మహర్షి గోదావరి తీరానికి వచ్చి బాసరలో నివసించారట. ఆ సమయంలో స్వయంగా ఆయనే గోదావరి ఇసుకతో జ్ఞాన సరస్వతితో పాటు మహాలక్ష్మి, మహాకాళి అమ్మవారి మూర్తులను ప్రతిష్ఠించారనేది స్థల పురాణం. అలా ముగ్గురమ్మల కొలువైన క్షేత్రంగా బాసర ప్రసిద్ధి చెందింది.

**అక్షరాభ్యాసాలతో..**

జ్ఞాన సరస్వతి కొలువైన క్షేత్రం కావడంతో ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో పిల్లలకు ఇక్కడ అక్షరాభ్యాసాలు చేయిస్తుంటారు. వసంత పంచమి, ఇతర పర్వదినాల్లో అక్షరాభ్యాసాలకు వచ్చే పిల్లలు, తల్లిదండ్రులు, భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. ప్రాచీన ఆలయం కావడం, ఏటేటా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగిన విధంగా అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బాసర ఆలయ అభివృద్ధి చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

**శృంగేరి పీఠాధిపతుల అనుమతితో..**

బాసర ఆలయ పునర్నిర్మాణ పనులకు మాస్టర్ ప్లాన్ రూపొందించే ముందు అధికారులు శృంగేరి పీఠాధిపతులతో సంప్రదించారు. గర్భాలయం, అర్ధమండపం, రాజగోపురం, ఇతర గోపురాలు, మాడ వీధులు, కోనేరు, ఉత్తర ద్వారం నిర్మాణాలకు సంబంధించి పీఠాధిపతుల అనుమతులు తీసుకున్నారు. వారి సూచనల మేరకు మాస్టర్ ప్లాన్ రూపొందించారు.

**విశాలంగా.. సౌకర్యంగా..**

భక్తుల సంఖ్య, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయం, అర్ధమండపాన్ని 5 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఉత్తర దిక్కున 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అంతస్తుల గోపురాలు, 33 అడుగుల వెడల్పుతో నాలుగు దిక్కుల మాడ వీధులు, ఉత్తర ద్వారం నిర్మించనున్నారు. మొత్తంగా ఆలయ విస్తీర్ణాన్ని 20 వేల చదరపు అడుగుల నుంచి 62 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు.

**శిలా నిర్మాణాలు..**

ఆలయంలో ప్రతి నిర్మాణాన్ని శిలలతో చేపట్టనున్నారు. 6 వేల మంది భక్తులకు అన్ని వసతులతో 70 వేల చదరపు అడుగుల క్యూ కాంప్లెక్స్‌లు, 200 మంది ఏకకాలంలో కూర్చొని ధ్యానం చేసుకునేలా ధ్యాన మందిరం, 20 వేల చదరపు అడుగుల వైశాల్యంతో వంటశాల, భోజనశాలలు, ప్రసాద పంపిణీ కేంద్రం, ఈశాన్య దిక్కున కోనేరు నిర్మించనున్నారు. తూర్పు దిక్కున ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిబింబించేలా తోరణాలు, సమాచార కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. దేవాలయానికి ఉత్తర, తూర్పు దిక్కుల్లో రోడ్ల అభివృద్ధి, అండర్‌పాస్, సోలార్ రూఫ్‌టాప్‌తో వాహనాల పార్కింగ్, పుష్పవనం పనులు చేపట్టనున్నారు. ఆలయ ప్రాంగణం బయట హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.

**పుష్కరాలకు వచ్చే వారికి..**

గోదావరి నది పుష్కరాలు వచ్చే ఏడాది జూన్‌లో ప్రారంభంకానున్నాయి. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు బాసర గోదావరి తీరానికి చేరుకుంటారు. వారికి అవసరమైన అన్ని వసతులను ప్రస్తుత మాస్టర్ ప్లాన్‌లో భాగంగా కల్పించనున్నారు. ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా, ఆలయ సంప్రదాయాలు, విశ్వాసాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# సైనికుడి కోసం అమెరికా బిగ్ ఆపరేషన్

- ఇరాన్‌లో కూలిన అమెరికా యుద్ధవిమానం
- పైలట్ రక్షణతో హైడ్రామా..
- మిస్సింగ్ అధికారిపై ఉత్కంఠ గాలింపు
- అమెరికా స్పెషల్ ఫోర్సెస్ మ్యాన్‌హంట్..
- సీఐఏ వ్యూహాలతో ట్విస్ట్

**ముద్ర డెస్క్:**



ఇరాన్ భూభాగంలో అమెరికాకు చెందిన ఎఫ్ 15ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధవిమానం కూలిన ఘటన అంతర్జాతీయంగా సంచలనం రేపింది. ఈ ప్రమాదంలో ఉన్న ఇద్దరు సిబ్బందిలో ఒక పైలట్‌ను అమెరికా దళాలు సురక్షితంగా రక్షించగా, వెపన్ సిస్టమ్స్ ఆఫీసర్ (డబ్ల్యూఎస్ఓ) ఆచూకీ కోసం ఉత్కంఠభరిత గాలింపు కొనసాగుతోంది. అమెరికా మీడియా కథనాల ప్రకారం, అదృశ్యమైన అధికారి గాయపడ్డప్పటికీ నడవగలిగే స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అతడు ఇరాన్ దళాలకు చిక్కకుండా పర్వత ప్రాంతాల్లో దాక్కున్నాడని భావిస్తున్నారు. నైరుతి ఇరాన్‌లోని కఠిన పర్వత ప్రాంతాలు ఈ మ్యాన్‌హంట్‌కు కేంద్రంగా మారాయి. ఇక ఇరాన్ వైపు నుంచి కూడా భారీ గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఐఆర్‌జీసీ (ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్), బసీజ్ దళాలు, స్థానిక గిరిజన గుంపులు కలిసి అమెరికా అధికారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీంతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు అమెరికా గూఢచార సంస్థ సీఐఏ కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. పైలట్ ఆచూకీని ముందుగానే గుర్తించి పెంటగాన్‌కు సమాచారం అందించడంతో పాటు, ఇరాన్ దళాల దృష్టి మరల్చేందుకు భూమార్గంలో కాన్వాయ్ ద్వారా తరలిస్తున్నట్లు తప్పుదారి పట్టించే ప్రచారం కూడా చేసినట్లు తెలుస్తోంది. రక్షణ చర్యల్లో భాగంగా అమెరికా ప్రత్యేక దళాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. వందల సంఖ్యలో స్పెషల్ ఫోర్సెస్, ఫైటర్ జెట్లు, హెలికాప్టర్లు రంగంలోకి దిగి శోధన కొనసాగించాయి. సైబర్, స్పేస్ ఇంటెలిజెన్స్ సాయంతో ఆపరేషన్‌ను సమన్వయం చేశారు. ఒక దశలో పైలట్ సమీపానికి చేరిన ఇరాన్ దళాలపై అమెరికా యుద్ధవిమానాలు బాంబింగ్ చేసి వెనక్కి నెట్టాయి. తర్వాత ఆరుగురు సభ్యుల నేవీ సీల్ బృందం గోప్యంగా ఇరాన్ భూభాగంలోకి ప్రవేశించి పైలట్‌ను రక్షించింది. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం కువైట్‌కు తరలించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఆపరేషన్‌లో మరో కీలక మలుపు వెలుగులోకి వచ్చింది. రెండు రవాణా విమానాలు ఇరాన్‌లోని రహస్య స్థావరంలో చిక్కుకోవడంతో, సున్నితమైన సాంకేతిక పరికరాలు శత్రు చేతుల్లో పడకుండా అమెరికా దళాలే వాటిని పేల్చివేసినట్లు తెలుస్తోంది. అయితే ఇరాన్ ఐఆర్‌జీసీ వాదన భిన్నంగా ఉంది. తమ దళాలు అమెరికాకు చెందిన సి130 విమానం, రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లను ధ్వంసం చేశాయని ప్రకటించింది. కొన్ని అమెరికా మీడియా సంస్థలు మాత్రం హెలికాప్టర్లు దెబ్బతిన్నాయని మాత్రమే పేర్కొన్నాయి. ఈ ఘటనతో అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదృశ్యమైన వెపన్ సిస్టమ్స్ ఆఫీసర్ కోసం గాలింపు కొనసాగుతుండగా, పరిస్థితి ఎలా మారుతుందన్నదానిపై ప్రపంచ దృష్టి నిలిచింది.

## అమరావతి రైతుల త్యాగ ఫలితమే రాజధాని బిల్లు ఆమోదం

- నందమూరి రామకృష్ణబాబు

**ముద్ర ప్రతినిధి, అమరావతి :**

పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా రాజధాని రైతులు విజయవాడలో నందమూరి రామకృష్ణబాబును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో తమ ఉద్యమాలకు అండగా నిలిచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. రాజధాని రైతులు మాట్లాడుతూ, గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ కాలంలో తమకు ఎదురైన ఇబ్బందుల సమయంలో భరోసా ఇచ్చిన రామకృష్ణబాబుకు ధన్యవాదాలు తెలిపారు. బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా ఆయనను కలవడానికి వచ్చామన్నారు.. నందమూరి రామకృష్ణబాబు మాట్లాడుతూ అమరావతి రాజధానిగా ఉండాలని రైతులు చేసిన ఉద్యమాలపై గతంలో అన్యాయం జరిగిందని ఆరోపించారు. న్యాయం, ధర్మం ఎప్పటికైనా విజయం సాధిస్తాయని, పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడం దానికి నిదర్శనమన్నారు. ఈ విజయానికి కారణమైన రాజధాని రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులిచిన్న, చెన్నుపాటి గాంధీ, వల్లూరు కిరణ్, బెస్త రాంప్రసాద్, దివాకర్, సొంటి శివరాం ప్రసాద్, నరసయ్య, మహమ్మద్ నూరు, చక్రి తదితరులు పాల్గొన్నారు.

# అక్షయ విద్యా ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం: డీజీపీ శివధర్ రెడ్డి

- పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యా సేవలు : సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

**ముద్ర, శేరిలింగంపల్లి :**




అక్షయ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి సీట్లు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను గౌరవించేందుకు శనివారం సైబరాబాద్ సీపీ కార్యాలయంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ బి. శివధర్ రెడ్డి సైబరాబాద్ హెడ్‌క్వార్టర్స్‌లో పికిల్‌బాల్ కోర్టును ప్రారంభించి ఆటలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ బి. శివధర్ రెడ్డితో పాటు పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, అక్షయ విద్యా ఫౌండేషన్ చైర్మన్ జే. వివేక్ ఆనంద్, వ్యవస్థాపకుడు మరియు ఉపాధ్యక్షుడు టి. ప్రసాద్, వ్యవస్థాపకుడు మరియు ట్రస్టీ ఎస్. జనార్ధన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు విద్యార్థులను అభినందిస్తూ వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయాన్ని సీపీ కార్యాలయం ఆదివారం పత్రిక ప్రకటనలో వెల్లడించింది. డీజీపీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, వారి విజయానికి కారణమైన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో పరిశ్రమలు, ఫ్యాక్టరీలు నిర్వహిస్తున్న వారు అవసరమైన వారికి కొంత భాగాన్ని కేటాయించడం గొప్ప విషయమని అన్నారు. ఈ దిశగా ఎస్. జనార్ధన్, వారి కుమారుడు టి. ప్రసాద్ అక్షయ విద్యా ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలను ప్రశంసించారు. సమాజానికి ఇటువంటి ఫౌండేషన్లు ఎంతో అవసరమని, అక్షరాస్యతకు నాంది పలుకుతున్న అక్షయ విద్యా ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. విద్య అందుబాటులో లేని ప్రాంతాల్లో నేరాల శాతం పెరిగే ప్రమాదం ఉంటుందని, అలాంటి ప్రాంతాల్లో అక్షయ విద్యా ఫౌండేషన్ రాత్రి సమయాల్లో కూడా ట్యూషన్లు, స్టడీ అవర్స్ నిర్వహిస్తూ గత 16 సంవత్సరాలుగా సేవలందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ డీజీపీ శివధర్ రెడ్డి, సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ అక్షయ విద్యా ఫౌండేషన్‌కు అందిస్తున్న సహకారం అభినందనీయమని తెలిపారు. సమాజంలోని చివరి వ్యక్తికి విద్య చేరేలా చేయడంలో అక్షయ విద్యా ఫౌండేషన్ విశేషంగా కృషి చేస్తోందని చెప్పారు. అక్షయ విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మరియు ట్రస్టీ ఎస్. జనార్ధన్ మాట్లాడుతూ చిన్న సెంటర్‌తో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం 140 సెంటర్లుగా విస్తరించి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నదని తెలిపారు. ప్రతి విద్యార్థికి విద్య హక్కు అనే నమ్మకంతో కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసి ఆధునిక సాంకేతికతతో బోధన అందిస్తున్నామని చెప్పారు. ఏపీఎస్ఆర్టీసీతో సమన్వయం చేసి విద్యార్థులకు రవాణా సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు అక్షయ విద్యా ఫౌండేషన్‌కు సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ అండగా నిలుస్తున్నారని, విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఆయన వ్యక్తిగతంగా జోక్యం చేసుకున్న సందర్భాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం డీజీపీ బి. శివధర్ రెడ్డి విద్యార్థుల ప్రతిభకు గుర్తింపుగా మెడల్స్ అందజేసి అభినందించారు. వారి విజయానికి అండగా నిలిచిన తల్లిదండ్రులను శాలువాలతో సత్కరించారు. ఎస్సీ, ఎస్సీ (సీఎస్ఆర్) కార్యక్రమాల భాగంగా వివిధ సంస్థలు వాహనాలను విరాళంగా అందించాయి. నోవాటెల్ కన్వెన్షన్ సెంటర్ హైదరాబాద్ నుంచి ఐదు హీరో కస్టమ్ బైకులు, ఎక్సెల్ రబ్బర్ ప్రైవేట్ నుంచి రెండు హీరో బైకులు అందించగా, మొత్తం ఏడు బైకులు, హారస్కో మరియు ఇతర సంస్థల నుంచి ఒక కారు అందించబడింది. మొత్తం 10 వాహనాలను డీజీపీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అబిలాష బిస్త్, సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, రిటైర్డ్ డీసీపీ మురళీధర్, ఏవీ ఎఫ్ చైర్మన్ జె. వివేక్ ఆనంద్, వ్యవస్థాపక మరియు ఉపచైర్మన్ టి. ప్రసాద్, వ్యవస్థాపక మరియు ట్రస్టీ ఎస్. జనార్ధన్, సభ్యురాలు (సంగమిత్రా పాఠశాల) జి. అరణ్యధి శ్రీనివాసన్ పాల్గొన్నారు.

## అమెరికా నేవీ సీల్ : ప్రపంచవ్యాప్తంగా మిషన్లు

నేవీ సీల్స్ ప్రపంచంలో ఎక్కడైనా ఆపరేషన్ చేయగలరు. ఎడారి, సముద్రం, అరణ్యం ఏ పరిస్థితుల్లోనైనా పనిచేస్తారు.







# ఎస్ఆర్ హెచ్ చెత్త రికార్డు..



**తొలి పది ఓవర్లలో పేలవ స్కోరు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నిరాశాజనకమైన బ్యాటింగ్ ప్రదర్శన చేసింది. సొంత మైదానంలో తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. ఆరంభంలో బ్యాటర్లు విఫలమవడంతో జట్టు ఒక అవాంఛిత రికార్డును నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు బ్యాటింగ్ ప్రారంభం అత్యంత నెమ్మదిగా సాగింది. తొలి పది ఓవర్లలో కేవలం 35 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఐపీఎల్ చరిత్రలో తొలి పది ఓవర్లలో ఇంత తక్కువ స్కోరు నమోదవడం చాలా అరుదు. ఇప్పటి వరకు నాలుగు సార్లు మాత్రమే ఈ స్థాయిలో తక్కువ పరుగులు నమోదయ్యాయి.
2009లో డెక్కన్ ఛార్జర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ తొలి పది ఓవర్లలో 31 పరుగులు చేయగా, అదే ఏడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 32 పరుగులు చేసింది. 2015లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 32 పరుగులు మాత్రమే చేసింది. తాజాగా లక్నోతో జరిగిన మ్యాచ్‌లో 35 పరుగులు చేసి హైదరాబాద్ జట్టు ఈ అవాంఛిత జాబితాలో చేరింది. ఒక దశలో హైదరాబాద్ జట్టు 100 పరుగులు దాటడం కూడా కష్టంగా కనిపించింది. అయితే మధ్యలో హెన్రిచ్ క్లాసెన్, నితీష్ రెడ్డి కీలక ఇన్నింగ్స్ ఆడుతూ జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ కలిసి ఐదో వికెట్‌కు 63 బంతుల్లో 116 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యంతో జట్టు స్కోరు 150 పరుగులు దాటడంలో కీలక పాత్ర పోషించారు. ఐపీఎల్‌లో హైదరాబాద్ జట్టు తరఫున ఐదో వికెట్ లేదా అంతకంటే దిగువ స్థానంలో నమోదైన అత్యధిక భాగస్వామ్యంగా ఈ రికార్డు నిలిచింది.

## పంత్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో లక్నో విజయం

**సొంత మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఎదురుదెబ్బ**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
సొంత మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు లక్నో సూపర్ జెయింట్స్ గట్టి షాక్ ఇచ్చింది. 157 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన లక్నో జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఓపెనర్ ఎడెన్ మార్‌క్రమ్ 45 పరుగులతో రాణించగా, కెప్టెన్ రిషబ్ పంత్ 68 నాటౌట్‌తో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించాడు. చివరి ఓవర్‌లో 9 పరుగులు అవసరమైన సమయంలో వరుస బౌండరీలు బాది లక్నోకు ఈ సీజన్‌లో తొలి విజయాన్ని అందించాడు. లక్ష్య ఛేదనలో లక్నోకు ఓపెనర్లు శుభారంభం అందించారు. మార్‌క్రమ్ దూకుడుగా ఆడి బౌండరీలు సాధించగా, మిచెల్ మార్ష్ 37 పరుగులతో రాణించాడు. పవర్‌ప్లే ముగిసే సరికి లక్నో వికెట్ నష్టానికి 53 పరుగులు చేసింది. అనంతరం మార్‌క్రమ్ అవుట్ కాగా, ఇంపాక్ట్ సబ్ ఆయుష్ బదోని 12 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. నికోలస్ పూరన్ తక్కువ స్కోరుకే అవుట్ అయినా, రిషబ్ పంత్, అబ్దుల్ సమద్ కలిసి జట్టును గెలుపు దిశగా నడిపించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 156 పరుగులు చేసింది. పవర్‌ప్లేలో మహ్మద్ షమీ అద్భుతంగా బౌలింగ్ చేసి కీలక వికెట్లు సాధించాడు. టాప్ ఆర్డర్ తడబడిన దశలో హెన్రిచ్ క్లాసెన్ 62 పరుగులు, నితీశ్ రెడ్డి 55 పరుగులతో జట్టును నిలబెట్టారు. వీరి భాగస్వామ్యంతో హైదరాబాద్ పోరాడగల స్కోరు సాధించినా, చివర్లో బౌలర్లు లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయారు.





## డకౌట్లలో రోహిత్, సంజూతో సమంగా అభిషేక్..

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026లో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ నిరాశపరిచాడు. ఈ మ్యాచ్‌లో రెండు బంతులు ఎదుర్కొన్న అతడు ఖాతా తెరవకుండానే రనౌట్ అయ్యాడు. దీంతో డక్‌గా వెనుదిరిగిన అభిషేక్ శర్మ తన పేరుకు చెత్త రికార్డును జోడించుకున్నాడు. ఒకే క్యాలెండర్ సంవత్సరంలో అత్యధిక సార్లు డక్‌కు ఔటైన భారత బ్యాటర్ల జాబితాలో రోహిత్ శర్మ, సంజూ శాంసన్ సరసన నిలిచాడు. అంతకుముందు ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో కూడా అభిషేక్ పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. 2026 సంవత్సరంలో టీ20 ఫార్మాట్‌లో అభిషేక్ శర్మ ఇప్పటివరకు ఆరుసార్లు డక్‌కు ఔటయ్యాడు. ఇదే సంఖ్యలో 2018లో రోహిత్ శర్మ ఆరుసార్లు డక్‌గా వెనుదిరిగాడు. అలాగే 2024లో సంజూ శాంసన్ కూడా ఆరుసార్లు సున్నాకే ఔటయ్యాడు. దీంతో ఒకే ఏడాదిలో టీ20ల్లో అత్యధిక సార్లు డక్‌కు ఔటైన భారత ఆటగాళ్ల జాబితాలో అభిషేక్ చేరాడు. ఇక మరోసారి డక్‌కు ఔటైతే ఈ ఇద్దరి రికార్డులను అధిగమించే అవకాశం ఉంది. ఈ ఏడాది అభిషేక్ శర్మ ప్రదర్శన మిశ్రమంగా కొనసాగుతోంది. న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో రెండు సార్లు ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. టీ20 ప్రపంచకప్ 2026లో కూడా మూడు మ్యాచ్‌ల్లో పరుగులు చేయలేకపోయాడు. తాజాగా ఐపీఎల్‌లో కూడా డక్‌గా వెనుదిరగడంతో ఈ ఏడాదిలో మొత్తం ఆరుసార్లు సున్నాకే ఔటైనట్లు నమోదైంది. ఇక లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆరంభంలోనే కష్టాల్లో పడింది. జట్టు 26 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో నితీశ్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్ జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 63 బంతుల్లో 116 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. నితీశ్ రెడ్డి 56 పరుగులు చేయగా, క్లాసెన్ 62 పరుగులు సాధించాడు. వీరి ఇన్నింగ్స్‌లతో హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 156 పరుగుల గౌరవప్రద స్కోరు సాధించింది.

## 16 ఏళ్లలో తొలిసారి ఆర్సీబీ మ్యాచ్‌కు ధోనీ దూరం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 19వ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు తలపడుతున్న మ్యాచ్‌లో సీఎస్కే స్టార్ ఆటగాడు ఎంఎస్ ధోనీ దూరమయ్యాడు. దాదాపు 16 ఏళ్లలో తొలిసారి ఆర్సీబీతో జరుగుతున్న మ్యాచ్‌లో ధోనీ ప్లేయింగ్ 11లో చోటు దక్కించుకోలేదు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. టాస్ సమయంలో ధోనీ ఫిట్‌నెస్‌పై వచ్చిన ప్రశ్నకు స్పందించిన గైక్వాడ్, ధోనీ ఇంకా పూర్తిగా కోలుకోలేదని తెలిపారు. నెమ్మదిగా గాయం నుంచి కోలుకుంటున్నాడని, పూర్తిగా ఫిట్ అయితే త్వరలోనే మైదానంలోకి తిరిగి వస్తాడని వెల్లడించాడు. కాలి కండరాల గాయంతో బాధపడుతున్న ధోనీ సీజన్ ప్రారంభానికి ముందే తొలి రెండు వారాలు మ్యాచ్‌లకు దూరంగా ఉంటాడని జట్టు యాజమాన్యం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఈ కీలక మ్యాచ్‌లో ధోనీ లేకపోవడం సీఎస్కే అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది.





## పవర్‌ప్లే వికెట్లలో జహీర్ ఖాన్‌ను దాటిన షమీ

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌లో 10వ లీగ్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. మ్యాచ్ ప్రారంభంలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు చెందిన ప్రమాదకర బ్యాటర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ వికెట్లను తీసి మహ్మద్ షమీ కీలక పాత్ర పోషించాడు. దీంతో ప్రత్యర్థి జట్టుపై ఒత్తిడి పెంచాడు. ఈ మ్యాచ్‌లో షమీ ప్రదర్శనతో ఐపీఎల్ చరిత్రలో పవర్‌ప్లేలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో జహీర్ ఖాన్‌ను వెనక్కి నెట్టి 7వ స్థానానికి చేరుకున్నాడు. ఐపీఎల్ పవర్‌ప్లేలో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ల జాబితాలో భువనేశ్వర్ కుమార్ 79 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. తర్వాత ట్రెంట్ బౌల్ట్ 72 వికెట్లు, దీపక్ చాహర్ 67 వికెట్లు, సందీప్ శర్మ 62 వికెట్లు, ఉమేశ్ యాదవ్ 58 వికెట్లు, ఇషాంత్ శర్మ 57 వికెట్లు, మహ్మద్ షమీ 54 వికెట్లతో కొనసాగుతున్నారు. జహీర్ ఖాన్ 52 వికెట్లతో తదుపరి స్థానంలో ఉన్నాడు. ఇదిలా ఉండగా ఈ మ్యాచ్‌లో మహ్మద్ షమీ అద్భుతంగా బౌలింగ్ చేసి 4 ఓవర్లలో కేవలం 9 పరుగులు మాత్రమే ఇచ్చి 2 వికెట్లు సాధించాడు. దీంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లను పరుగులు చేయకుండా కట్టడి చేయడంలో విజయవంతమయ్యాడు.

## తుషార్ దేశ్‌పాండేపై డేల్ స్టెయిన్ ప్రశంసలు

**భారత సెలెక్టర్ల దృష్టి అతనిపైనే ఉంటుందన్న అంచనా**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు అద్భుత ఆరంభం చేసింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించి జోరు కొనసాగిస్తోంది. రెండో మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో రాజస్థాన్ రాయల్స్ 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 210 పరుగులు నమోదు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన గుజరాత్ టైటాన్స్ 19 ఓవర్లలో 200 పరుగులు చేసి చివరి ఓవర్లో 11 పరుగులు అవసరమైన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో తుషార్ దేశ్‌పాండే అద్భుత బౌలింగ్‌తో గుజరాత్‌ను 204 పరుగులకే పరిమితం చేసి జట్టుకు కీలక విజయాన్ని అందించాడు. మ్యాచ్ అనంతరం వెటరన్ ఫాస్ట్ బౌలర్ డేల్ స్టెయిన్ మాట్లాడుతూ, ఒత్తిడి పరిస్థితుల్లో ప్రశాంతంగా బౌలింగ్ చేయడం ప్రతి బౌలర్‌కు సవాలేనని పేర్కొన్నాడు. తుషార్ దేశ్‌పాండే చివరి ఓవర్లో వరుసగా ఖచ్చితమైన యార్కర్లు వేయడం వల్ల రషీద్ ఖాన్ వంటి బ్యాటర్‌కు పెద్ద షాట్లు ఆడే అవకాశం ఇవ్వలేదని వివరించాడు. తుషార్ దేశ్‌పాండే ప్రదర్శనను గమనించిన భారత సెలెక్టర్లు ఈ సీజన్ మొత్తం అతనిపై దృష్టి పెట్టే అవకాశముందని డేల్ స్టెయిన్ అంచనా వేశాడు. ఈ మ్యాచ్‌లో దేశ్‌పాండే మూడు ఓవర్లు బౌలింగ్ చేసి 24 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ సాధించాడు. రాజస్థాన్ రాయల్స్ జట్టు తన తదుపరి మ్యాచ్‌ను ఏప్రిల్ 7న గువాహటి వేదికగా ముంబై ఇండియన్స్‌తో ఆడనుంది.

## డిఫరెంట్ కాన్సెప్ట్ తో 'ది రెడ్ బ్యాగ్.. ఫస్ట్ లుక్ పోస్టర్ వైరల్




**ముద్ర సినిమా డెస్క్ :**
డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న 'ది రెడ్ బ్యాగ్' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ఒక బ్యాగ్ చుట్టూ తిరిగే ఆసక్తికరమైన కథతో రూపొందిన ఈ చిత్రాన్ని హరికృష్ణ సోమిశెట్టి నిర్మించగా, రవికుమార్ శీరపు కథ, కథనం, దర్శకత్వం వహించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.కబీర్ దుహన్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. హీరో దినేష్ తేజ్ చేతుల మీదుగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. శేఖర్ మోపూరి సంగీతం అందించిన ఈ చిత్రానికి ప్రియేష్ గురుసామి సినిమాటోగ్రఫీ అందించారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
06.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## ఎర్రని హాట్ లుక్‌తో మెరిసిన శ్రీలీల

ముద్ర, సినిమా డెస్క్ :

యువ నటి శ్రీలీల తన తాజా ఫోటోషూట్‌తో మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. పర్పుల్‌రెడ్ బ్యాక్‌డ్రాప్ ముందు ఆమె ధరించిన ఎర్రని డిజైనర్ అవుట్‌ఫిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒరిగామి స్టైల్ డిజైన్‌తో ఉన్న ఆ డ్రస్ ఆమెకు బోల్డ్ లుక్‌తో పాటు ఎలిగెన్స్‌ను కూడా అందించింది. సింపుల్ హెయిర్ స్టైల్, గోల్డ్ ఇయరింగ్స్‌తో ఆమె స్టైలింగ్ క్లాసీగా కనిపించగా, ఆమె చూపులో కనిపించే కాన్ఫిడెన్స్ ఫోటోలకు హైలైట్‌గా మారింది. పోజింగ్‌లో కూడా సహజత్వాన్ని చూపించిన శ్రీలీల, స్ట్రాంగ్ మరియు సాఫ్ట్ లుక్‌ల మేళవింపుతో ఆకట్టుకుంది. ఇండస్ట్రీలో విజయాలు, అపజయాలు సహజమని భావించే ఆమె, ప్రతి అనుభవం నుంచి నేర్చుకోవడానికే ప్రాధాన్యం ఇస్తుంది. వ్యక్తిగత జీవితం, వృత్తి జీవితం మధ్య సమతుల్యతను కాపాడుకోవడం తనకు ముఖ్యమని చెబుతోంది





## ఫౌజీ' లీకులపై మేకర్స్ వార్నింగ్
# షేర్ చేస్తే కఠిన చర్యలు


ముద్ర, సినిమా డెస్క్ :

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఫౌజీ' సినిమా సెట్స్ నుంచి కొన్ని ఫోటోలు లీక్ కావడం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ కావడంతో చిత్రబృందం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో మేకర్స్ అధికారిక ప్రకటన విడుదల చేస్తూ, అనధికారికంగా బయటకు వస్తున్న ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి లీకులు సినిమా పై ఉన్న ఆసక్తిని దెబ్బతీస్తాయని, టీమ్ శ్రమను కూడా వృథా చేస్తాయని పేర్కొన్నారు. దర్శకుడు హను రాఘవపూడి కూడా స్పందిస్తూ, ఒక మంచి విజువల్ అనుభూతిని ప్రేక్షకులకు అందించేందుకు టీమ్ ఎంతో కష్టపడుతోందని చెప్పారు. వెండితెరపై చూడాల్సిన మ్యాజిక్‌ను లీక్స్ ద్వారా ముందుగానే బయట పెట్టడం సరైంది కాదని, అభిమానులు సహకరించాలని కోరారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. హీరోయిన్‌గా ఇమాన్వి పరిచయం అవుతున్న ఈ సినిమాతో ప్రేక్షకులకు ఓ ప్రత్యేక అనుభూతి అందిస్తామని మేకర్స్ భరోసా ఇస్తున్నారు.

## డా. నాగేశ్వరరావు పూజారి కొత్త చిత్రం
# పోస్టర్, మోషన్ పోస్టర్ విడుదల

ముద్ర, సినిమా:

ప్రముఖ అడ్వకేట్, *'రాజు వెడ్స్ రాంబాయి'* చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరించిన డా. నాగేశ్వరరావు పూజారి తన *'సైన్మా స్టూడియోస్'* బ్యానర్‌పై తొలి నిర్మాణాన్ని ప్రకటించారు. ఈ చిత్రానికి దర్శక నిర్మాత వేణు ఊడుగుల సమర్పకుడిగా వ్యవహరిస్తుండగా, పీవీఎన్ కార్తికేయ దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాత డా. నాగేశ్వరరావు పూజారి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర ప్రకటనతో పాటు పోస్టర్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదల చేసిన పోస్టర్‌లో ఒక అమ్మాయి కంటిని చూపిస్తూ, ఆ కంటిలో అన్నా-తమ్ముడు సైకిల్‌పై వెళ్తున్న దృశ్యాన్ని ప్రతిబింబించారు. అన్నదమ్ముల బంధం మధ్య అహం అనే గోడలు ఏర్పడితే సంబంధాలు దూరమవుతాయనే భావాన్ని పోస్టర్‌పై ఉన్న సందేశం ద్వారా తెలియజేశారు. ఈ చిత్రం త్వరలోనే




షూటింగ్ ప్రారంభానికి సిద్ధమవుతోందని, దీనికి సంబంధించిన ఇతర వివరాలను చిత్ర బృందం త్వరలో వెల్లడించనున్నట్లు తెలిపారు.



# కంటి చూపుతోనే కవ్విస్తున్న శ్రియ

ముద్ర, సినిమా డెస్క్ :

టాలీవుడ్ అందాల తార శ్రియ సరణ్ మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాలో హీట్ పెంచుతోంది. తాజా ఫోటోలో ఆమె చూపించిన స్టైలింగ్, ఎక్స్‌ప్రెషన్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నాయి. డీప్ బర్గండీ వెల్వెట్ సోఫాపై కంఫర్ట్‌గా వాలిపోయి కనిపించిన శ్రియ, లావెండర్ కలర్ మినీ డ్రెస్సులో అద్భుతంగా మెరిసింది. సీక్విన్స్, ఫ్లోరల్ డిజైన్‌లతో ఉన్న ఆ అవుట్‌ఫిట్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చింది. సిల్వర్ స్ట్రాపీ హీల్స్, సింపుల్ పెర్ల్ ఇయరింగ్స్‌తో ఆమె స్టైలింగ్‌ను క్లాసీగా కంప్లీట్ చేసింది. వెనుక ఉన్న వెల్వెట్ కర్టెన్స్ మొత్తం ఫ్రేమ్‌ను రిచ్‌గా మార్చగా, ఆమె చూపు మాత్రం అందరి దృష్టిని కట్టిపడేస్తోంది. కెమెరా కోసం ప్రత్యేకంగా పోజ్ ఇచ్చినట్టుగా కాకుండా సహజంగా కనిపిస్తూ, కేవలం కంటి చూపుతోనే కవ్వించేలా కనిపించడం విశేషం. ప్రస్తుతం ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు శ్రియ గ్లామర్‌కు ఫిదా అవుతున్నారు. వయసు పెరుగుతున్నా ఆమె అందం మాత్రం రోజురోజుకూ మరింత మెరుగవుతోందని కామెంట్స్ చేస్తున్నారు.



# నిర్మాతలు నన్ను అలా టెంప్ట్ చేస్తున్నారు

ముద్ర, సినిమా డెస్క్ :

టాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం కెరీర్‌లో జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. 'సీతారామం', 'హాయ్ నాన్న' సినిమాల తర్వాత వచ్చిన గుర్తింపుతో, స్క్రిప్ట్ ఎంపికలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. అడివి శేష్‌తో కలిసి నటిస్తున్న 'డెకాయిట్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ, పెద్ద మేకర్స్ నుంచి ఆకర్షణీయమైన ఆఫర్లు వస్తున్నాయని, కానీ కథ బలంగా లేకపోతే వాటిని తిరస్కరిస్తున్నానని చెప్పింది. మంచి కథ కోసం వేచి ఉండడమే తన లక్ష్యమని స్పష్టం చేసింది. ఇక 'డెకాయిట్' ట్రైలర్‌లో అడివి శేష్ యాక్షన్‌తో ఆకట్టుకోగా, కథలో ప్రతీకారం, భావోద్వేగాల మేళవింపు ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి.

## బడా ప్రొడక్షన్ చేతికి 'పెద్ది' నైజాం హక్కులు

ముద్ర, సినిమా డెస్క్ :

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. రిలీజ్‌కు ముందే ఈ మూవీ బిజినెస్ కూడా జోరుగా సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా నైజాం హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. నైజాం ఏరియాలో ఈ సంస్థకు ఉన్న బలమైన పట్టుతో, అక్కడ ఈ సినిమాను భారీ స్థాయిలో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో జాన్వి కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. షూటింగ్ చివరి దశలో ఉండగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి. ఏప్రిల్ 30న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.






## 'సత్తిబాబు పరలోక యాత్ర'కు సంతోష్ శోభన్ సిద్ధం

ముద్ర, సినిమా డెస్క్ :

యంగ్ హీరో సంతోష్ శోభన్ నటించిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా ఇటీవల మంచి విజయాన్ని అందుకుంది. ఈ చిత్రం థియేటర్లతో పాటు ఓటీటీలో కూడా ప్రేక్షకుల ఆదరణ పొందింది. తమిళనాడులో ఈ సినిమా 50 రోజుల పాటు ప్రదర్శితమై అక్కడ కూడా మంచి విజయాన్ని సాధించింది. తెలుగు హీరో నటించిన సినిమా తమిళనాడులో 50 రోజులు ప్రదర్శితమవడం అరుదైన విషయంగా సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ విజయోత్సాహంతో సంతోష్ శోభన్ తన కొత్త చిత్రం 'సత్తిబాబు పరలోక యాత్ర' షూటింగ్‌కు సిద్ధమవుతున్నాడు. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఏఆర్ ఫిలింస్ బ్యానర్‌పై తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్నారు. 'స్వాతిముత్యం' ఫేమ్ దర్శకుడు లక్ష్మణ్ కె కృష్ణ ఈ సినిమాను రూపొందిస్తున్నారు.

పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న 'సత్తిబాబు పరలోక యాత్ర' సినిమా జూన్ మొదటి వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపొందుతుండటంతో ఈ ప్రాజెక్టుపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను చిత్ర బృందం త్వరలో వెల్లడించనుంది.

# పళ్లిచట్టంబి' ట్రైలర్ విడుదల..

**యాక్షన్ సన్నివేశాలతో ఆకట్టుకున్న వీడియో**

ముద్ర, సినిమా డెస్క్:

మలయాళ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం *'పళ్లిచట్టంబి'*పై పాన్ ఇండియా స్థాయిలో అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తుండగా, కయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా ఈ నెల 10న ఐదు భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో పేదల భూములపై కొందరు స్వార్థపరులు కన్నేసి, ప్రజలను అణగదొక్కడానికి ప్రయత్నించే కథను చూపించారు. ఈ పరిస్థితుల్లో ఓ వ్యక్తి గ్రామంలోకి వచ్చి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి వారితో కలిసి పోరాటం చేసే కథాంశం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాలు, టొవినో థామస్ నటన, కయదు లోహర్ స్క్రీన్ ప్రెజెన్స్ ట్రైలర్‌కు హైలైట్స్‌గా నిలిచాయి. 1950, 60 దశకాల నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది.




Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com